

ఉలిక్కిపడిన నగరం



ఈస్టిండియా కంపెనీపై పిడుగు

ప్రమాద ప్రాంతానికి సమీపంలో పెట్రోలియం రిఫైనరీలు

- ఘటనా స్థలానికి 50 వరకు అగ్నిమాపక శకటాలు
- ట్యాంకులో కొనసాగుతున్న మంటలు
- సంఘటన ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, అగ్నిమాపక డీజీ, పీసీబీ, ఫ్యాక్టరీస్ అధికారులు



సంఘటనా స్థలం వద్ద మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విశాఖపట్నం/మల్కాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): **ఈస్టిండియా పెట్రోలియం కంపెనీలోని ఫిల్టర్ ట్యాంకుపై పిడుగు పడడంతో నగరం ఉలిక్కిపడింది. అత్యంత శక్తివంతమైన పిడుగు దెబ్బకు ఎంతో బరువైన, సురక్షితమైన ట్యాంకు పైకప్పు ఊడిపడింది. మల్కాపురం పారిశ్రామిక ప్రాంతంలో ఏ ప్రమాదం జరిగినా దాని పర్యవసనాలు తీవ్రంగా ఉండడంతో నగర ప్రజలు ఆందోళనకు గురయ్యారు.**

ఆదివారం మధ్యాహ్నం నుంచి పారిశ్రామిక ప్రాంతంలో వర్షం ప్రారంభమైంది. విశాఖకు ఆనుకుని పిడుగులు పడతాయని తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరిక బులెటిన్ విడుదల చేసిన కొద్ది గంటల్లోనే డాక్‌యార్డుకు కొద్దిదూరంలో ఉన్న ఈస్టిండియా కంపెనీపై పెద్ద శబ్దంతో పిడుగు పడింది. వెంటనే నింగిన తాకేలా మంటలు రేగడంతో ఏదో ప్రమాదం జరిగిందని నగరవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పిడుగుపడి హెచ్‌పీసీఎల్ తగలబడిపోతుందంటా..? నిజమేనా..? అనే వదంతులు వ్యాపించాయి. అయితే ఈస్టిండియా కంపెనీలో ప్రమాదం జరిగిందని తేలడంతో కొంత ఆందోళన తగ్గింది. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో భయం భయంగా గడిపారు. అయితే పిడుగు ఈస్టిండియా కంపెనీకి సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్ ఎల్‌పీజీ ప్రాజెక్టు, హెచ్‌పీసీఎల్ అడిషనల్ ట్యాంక్ ప్రాజెక్టు, భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఆవరణలో పడితే పెద్దఎత్తున ప్రాణ నష్టం సంభవించేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ట్యాంకు సామర్థ్యం 7,200 కిలో లీటర్లు

ఈస్టిండియా కంపెనీ ఆవరణలో సుమారు 50 స్టోరేజీ ట్యాంకులున్నాయి. ఇతర దేశాల నుంచి పలు రకాల ముడిచమురు, అనుబంధ ఉత్పత్తులను కొన్ని కంపెనీలు విశాఖ పోర్టుకు దిగుమతి చేసుకుని ఇక్కడ నుంచి బయటకు తరలిస్తుంటాయి. పోర్టు నుంచి ఒకేసారి వేల కిలో లీటర్లు రవాణా సాధ్యంకానందున పోర్టు ఏరియాలో ఉన్న ఈస్టిండియా కంపెనీలో నిల్వ చేస్తుంటారు. ఆదివారం పిడుగు ధాటికి గురైన ట్యాంకు సామర్థ్యం 7,200 కిలో లీటర్లు. అయితే ప్రస్తుతం 7 వేల కిలో లీటర్ల మిథనాల్ ఆయిల్ నిల్వ ఉంది. మిథనాల్ ఆయిల్ కామన్ సాల్వెంట్. దీని నుంచి పలు రకాల ఉత్పత్తులు తయారుచేస్తారు. దీనికి వుడ్ ఆయిల్ అని కూడా అంటారు. మిథనాల్ ఆయిల్‌కు మండే స్వభావం ఉంది. అయితే ఆదివారం పిడుగు పడడంతో ట్యాంకుపై కప్పు ఊడిపోయింది. పిడుగు ధాటికి ... మిగతా 6వ పేజీలో



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు)

లైట్నింగ్ ప్రొటెక్టర్ లేదా?

పిడుగు ప్రమాదం నుంచి రక్షణకు చాలా భవనాలపై లైట్నింగ్ ప్రొటెక్టర్లు అమర్చుతారు. నగరంలో చాలా భవనాలు, వాణిజ్య సముదాయాలపై వీటినా అమర్చడం సర్వసాధారణం. భవనాలు, సముదాయాలపై భాగాన వాటిని అమర్చి అక్కడి నుంచి వైర్లను కిందకు తీసుకువచ్చి భూమిలోకి పంపుతారు. ఇంటికి విద్యుత్ సరఫరా చేసేటప్పుడు ఎర్త్ ఇచ్చినట్టే. ఇవి పిడుగు ప్రభావం నుంచి పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తాయి. అయితే ఈస్టిండియా కంపెనీలో లైట్నింగ్ ప్రొటెక్టర్లు ఏర్పాటు చేయలేదా అనే సందేహాలు రేకెత్తుతున్నాయి. అయితే ముడిచమురు నిల్వఉంచిన ఎత్తైన ట్యాంకులపై లైట్నింగ్ ప్రొటెక్టర్లు అమర్చితే ఇబ్బందులు తలెత్తు ప్రమాదం ఉందని కొందరు నిపుణులు చెబుతున్నారు. అయితే కంపెనీ ఆవరణలోని భవనాలపై అమర్చవచ్చుచని, తద్వారా తగిన రక్షణ లభిస్తుందని వివరించారు. కంపెనీ ఆవరణకు ఆనుకుని చెట్లు, రాత్రి సమయాల్లో లైటింగ్ కోసం ఎత్తుగా ఏర్పాటుచేసిన టవర్లు ఉన్నందున పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని అంటున్నారు.

పెట్రోలియం ఫిల్టరింగ్ ట్యాంకుపై పిడుగు

- ఈఐపీఎల్‌లో సంఘటన
- భారీగా చెలరేగిన మంటలు

- వివరాలు మెయిన్‌లో



సింహాచలం ప్రధాన రాజగోపుర ద్వారం మూసివేస్తున్న అర్చకులు, అధికారులు

మూతపడిన ఆలయాలు

- చంద్ర గ్రహణం ఎఫెక్ట్

చంద్రగ్రహణం కారణంగా సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి, వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి, సిరిపురంలోని సంపత్ వినాయగర్, రుషికొండ వెంకటేశ్వరస్వామి, పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం మూతపడ్డాయి. అధికారుల సమక్షంలో అర్చకులు ప్రధాన ప్రవేశ ద్వారాల తలుపులు మూసివేశారు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా ఆలయాలను మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు.

ముగిసిన మూడో విడత డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితా మేరకు మూడోవిడత అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారం ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయంలో నిర్వహించారు. మొత్తం 23 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇప్పటివరకు రెండువిడతల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాగా మూడోవిడత ఆదివారం నిర్వహించామని డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు, తదితరులు

అన్ని రంగాల్లో రజకుల అభివృద్ధే ధ్యేయం

- మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, రవీంద్ర

-7లో

దర్జాగా కబ్జా



నరవలోని విశాఖ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణం

- ప్రభుత్వ స్థలంలో ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణాలు
- కళాశాల చుట్టూ రెవెన్యూ, ఫారెస్ట్ భూములు
- ఇదే అదనుగా ఆక్రమణ

గోపాలపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమణలకు తెగబడే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. ఈ క్రమంలో ఓ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం కబ్జాకు తెరతీసింది. కళాశాల చుట్టూ రెవెన్యూ, అటవీ భూములు ఉండడంతో అవకాశం ఉన్న మేరకు స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణాలు చేపడుతోంది.**

గ్రేటర్ 88వ వార్డు నరవ గ్రామ శివారు కొండవాలు ప్రాంతంలో విశాఖ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. దీని చుట్టూ రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ , అటవీశాఖ భూములున్నాయి. వాటిని కళాశాల యాజమాన్యం దర్జాగా వినియోగించుకుంటోంది. ఈ నేపథ్యంలో రెండేళ్ల కిందట అప్పటి పెందుర్తి తహశీల్దార్ రెవెన్యూ, అటవీ భూముల్లో కొంత భాగానికి ఫెన్సింగ్ వేయించారు. మిగిలిన భాగంలో రక్షణ చర్యలు చేపట్టలేదు. దీనిని ఆసరాగా చేసుకుని కళాశాల భవనాలకు కొండవాలులోని ఫారెస్ట్ భూములకు మధ్య ఉన్న సర్వే నంబరు 58లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం ప్రారంభించింది. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తినా అధికారులు స్పందించకపోవడంతో అక్రమణలకు వారు సహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పరిరక్షణ చర్యలేవీ?

కళాశాల చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆక్రమణలు ఊపందుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా చర్యలు తీసుకోకుంటే మరింత ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమయ్యే అవకాశం ... మిగతా 6వ పేజీలో

ముగిసిన ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్‌కౌంటర్ల వద్ద రద్దీ

- చివరి రోజు భారీగా తరలివచ్చిన ఆహార ప్రియులు

బీచ్ రోడ్ సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులోని ఎంజీఎం మైదానంలో ఏర్పాటుచేసిన వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. పర్యాటక శాఖ, హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్లు సంయుక్తంగా నిర్వహించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో అధికసంఖ్యలో నగర వాసులు తరలివచ్చి వివిధ రకాల ఆహారపదార్థాలను ఆస్వాదించారు. స్టార్ హోటల్స్ ప్రముఖ రెస్టారెంట్లు, ఇతర సంస్థలు అనేక రుచులను అందుబాటులో ఉంచాయి. హైదరాబాద్‌కు చెందిన నీలోఫర్ కేఫ్ టీ, బన్ స్టాల్ ఏర్పాటుచేసింది. పర్యాటక శాఖ ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించారు. మొత్తమ్మీద ఫెస్టివల్ నగరంలోని ఆహార ప్రియులకు సరికొత్త వంటకాలను రుచిచూపించింది.



జీవీఎంసీలో అవినీతి రాకెట్!

అధికారులపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా ఆగ్రహం

డీఆర్‌సీలో జీవీఎంసీ పనితీరుపైనే ప్రధాన చర్చ

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)



'జీవీఎంసీలో పెద్ద ఎత్తున అవినీతి రాకెట్ నడుస్తోంది. త్వరలోనే దానిని బయటకు తీస్తా.' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చేసిన వ్యాఖ్య లు జీవీఎంసీ అధికారుల్లో గుబులురేపుతోంది. తమ విభాగంలో ఎక్కడ ఎలాంటి అవినీతి జరుగుతుందోనని కొందరు అధికారులు సమీక్షించుకునేపనిలో పడితే... మరికొందరు తమ అవినీతి, అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని ఆందోళన చెందుతున్నారు.

- ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలపై ఎమ్మెల్యేల ఫిర్యాదు
- త్వరలోనే రాకెట్‌ను బయటకు తీస్తానన్న మంత్రి
- జీవీఎంసీ అధికారుల్లో గుబులు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొందరు ఎమ్మెల్యేలు జీవీఎంసీ పనితీరుపై తమ అసంతృప్తిని వ్యక్తంచేశారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ తీసికట్టుగా ఉందని, వీధిదీపాలు సరిగా వెలగడం లేదని, డ్రెయిన్లు, గెడ్డలు కబ్జాకు గురవుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యేలంతా ... మిగతా 6వ పేజీలో

నాన్‌స్టాప్ కౌంటర్లు ఖాళీ

- 40 శాతం దాటని ఆక్యుపెన్సీ రేషియో
- నిర్వహణ వ్యయం కూడా కష్టమే
- బస్సుల మధ్య వ్యవధిని పెంచిన అధికారులు



నాన్‌స్టాప్‌కౌంటర్లు ఖాళీగా ఉండటంపై ఆరా తీస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలుతో ద్వారకా, మద్దిలపాలెం బస్‌స్టేషన్లలోని నాన్‌స్టాప్ కౌంటర్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. షెడ్యూల్ సర్వీసులు నగటున కేవలం 40 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడుస్తున్నాయి. కనీసం 60 శాతం ఆక్యుపెన్సీ రాకుంటే బస్సుల నిర్వాహణ వ్యయం కూడా రావడం కష్టమేనని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కనీస ప్రయాణికులు లేకపోవడంతో నాన్‌స్టాప్ సర్వీసులు తాత్కాలికంగా రద్దు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

ద్వారకా, మద్దిలపాలెం బస్‌స్టేషన్‌ల నుంచి నర్సీపట్నం, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, ప్రాంతాలకు నాన్‌స్టాప్ ... మిగతా 6వ పేజీలో

ప్రాణం తీసిన వేట సరదా

మేహాద్రిగెడ్డలో మునిగి ఇద్దరు యువకుల మృతి

గోపాలపట్నం/పెందుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): **చేపల వేట సరదా రెండు నిండు ప్రాణాలు బలిగొంది. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ వద్ద వేటకు వెళ్లిన ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతిచెందారు. ఘటనకు సంబంధించి పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.**

పెందుర్తి సమీపంలోని జేఎన్‌ఎన్‌యూఆర్ఎం కాలనీ (అయ్యప్పకాలనీ)కి చెందిన బల్లంకి శేఖర్ (18), బల్లంకి వాసుతోపాటు చినముషిడివాడ సమీపంలోని ఆక్సిజన్ కాలనీకి చెందిన యాదాడ లక్ష్మణ్ కుమార్ (18) డాక్‌యార్డ్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు




రిజర్వాయర్ నుంచి బయటకు తీసిన బల్లంకి శేఖర్, యాదాడ లక్ష్మణ్ మృతదేహాలు




బల్లంకి శేఖర్, యాదాడ లక్ష్మణ్ (ఫైల్ ఫొటోలు)

ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో చేపలను వేటాడేందుకు మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌కు వెళ్లారు. రాతి రివిట్‌మెంట్‌పై కూర్చుని, నీటిలోకి గేలాలు వేశారు. ఈ క్రమంలో బల్లంకి శేఖర్, యాదాడ లక్ష్మణ్‌కుమార్ ముందుకు తూలి, నీటిలో పడి మునిగిపోయారు. అక్కడే వున్న బల్లంకి వాసు భయాందోళన చెంది, సమీపంలో వున్న రిజర్వాయర్ సిబ్బంది వద్దకు వెళ్లి, జరిగిన సంఘటన గురించి చెప్పాడు. వారు వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కేవీ సతీశ్ కుమార్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి యువకుల మృతదేహాలు లభించాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెందుర్తిలో విషాదం

వారిద్దరు ... మిగతా 6వ పేజీలో



తిరువీధిలో పల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

వైభవంగా పౌర్ణమి తిరువీధి

సింహాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి పౌర్ణమి తిరువీధి ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. బాలభోగ నివేదన తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ బేడా మండపంలో తిరువీధి ఉత్సవం జరిపారు. మార్గమధ్యలో అష్టదిక్పాలకులకు భక్తులు ప్రత్యేక ఆరాధనలు చేసి, కర్పూర నీరాజనాలిచ్చారు.

నేడు భీమిలి మండల సమావేశం

భీమునిపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండల సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్నట్టు ఎంపీడీవో నరసింహారావు తెలిపారు.ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

మజ్జిపేటలో మహిళలకు వంటల పోటీ

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజ్జిపేట గ్రామంలో మ్యూజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆదివారం వంటల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రోగ్రామ్ మేనేజరు కె. ఆనంద్, సమన్వయ అధికారి దూడ రమేశ్ మాట్లాడుతూ ఆహారంలో పోషక విలువల ప్రాధాన్యత తెలియజేయడానికి ఈ పోటీలు ఏర్పాటు చేశామని చెప్పారు.అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.

విద్యార్థులకు అదనపు బస్సు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సింహాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం నుంచి శొంఠ్యాం, పద్మనాభం మీదుగా విజయనగరం వెళ్లే బస్సులకు ఉదయం వేళ డిమాండ్ ఎక్కువగా ఉండడంతో సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు ఆ మార్గంలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు బస్సు ఏర్పాటు చేశారు. 'ప్రమాదకరంగా విద్యార్థుల ప్రయాణం' అన్న శీర్షికన గతనెల 31న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ప్రతిరోజూ సింహాచలం నుంచి నీళ్లకుండీల వరకు అదనపు బస్సు నడుపుతున్నట్టు చెప్పారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సురక్షిత ప్రయాణం సాగించాలని ఆయన కోరారు.

'అన్నదాత పోరుబాట' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ భీమిలి ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు

పద్మనాభం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అనేక సేవలు అందిస్తున్న రైతు సేవా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వైసీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం ఆయన పద్మనాభంలో అన్నదాత పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈనెల 9న భీమిలిలో అన్నదాత పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. భీమిలి మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి ఆర్డీఓకి వినతిపత్రం అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పద్మనాభం, భీమిలి ఎంపీపీలు రాంబాబు, వాసురాజు, పద్మనాభం, భీమిలి జెడ్పీటీసీ సభ్యులు గిరిబాబు, కోరాడ వెంకటరావు, వైసీపీ నాయకులు కోరాడ లక్ష్మణ్, మజ్జి వెంకటరావు, గాడు శ్రీను, బంక సత్యం, బోని అప్పలనాయుడు, ఈశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖాధికారులతో డీజీ సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీజీ వెంకటరమణ

విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో అగ్నిమాపక శాఖ పనితీరుపై ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ పి.వెంకటరమణ ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఐఐఎం క్యాంపస్‌లో జరిగిన ఈ సమావేశంలో తొలుత ఆయన ఆయా జిల్లాల్లోని శాఖల పనితీరు, భవనాల పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎన్‌ఓసీల జారీని రాష్ట్ర ప్రభుత్వం వికేంద్రీకరించడంతో ప్రజలు సులభంగా ఎన్‌ఓసీలు పొందగలుగుతున్నారని చెప్పారు. మున్సిపల్ శాఖతో కలిసి సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులు ఇవ్వడం వల్ల ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందన్నారు. వాట్సాప్ ద్వారా సేవలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. స్టేషన్లలో పరిశుభ్రత పెంపొందించేందుకు ఈనెలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ప్రతి బుధవారం సిబ్బంది సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరించనున్నట్టు చెప్పారు.

ప్రాణం తీసిన వేట సరదా

... 5వ పేజీ తరువాయి

బాల్యమిత్రులు. చిన్నపాటి పనులు చేస్తూనే చదువుకుంటున్నారు. వచ్చిన డబ్బుతో కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నారు. ఎక్కడికైనా కలిసే వెళ్తారు. చివరకు మృత్యువులోనూ వారి బంధం వీడలేదు. బల్లంకి శేఖర్. యాదాడ లక్ష్మణ్‌కుమార్ మృతితో పెందుర్తిలో విషాదం అలముకుంది, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. శేఖర్ చిన్నప్పుడే తండ్రి బంగార్రాజు మరణించడంతో తల్లి మహాలక్ష్మి కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. అన్నయ్య వాసు, మిత్రుడు లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి శేఖర్ డాక్‌యార్డులో పనికి వెళ్లేవాడు. లక్ష్మణ్‌కుమార్ తండ్రి సూరిబాబు ఎలక్ట్రీషియన్, తల్లి లక్ష్మి టైలర్. అన్నయ్య మన్మథరావు బిగ్‌బాస్కెట్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన అన్నయ్య వాసు, మిత్రుడు లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి చేపలు పట్టేందుకు మేహాద్రి రిజర్వాయర్‌కు వెళ్లారు. ఈ క్రమంలో కాలుజారి లక్ష్మణ్‌కుమార్ నీటిలో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు దూకిన శేఖర్ విఫలమై, అతడుకూడా మునిగిపోయాడు. దీంతో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

అప్పన్న ఆలయం మూసివేత

- చంద్ర గ్రహణం కారణంగా 11.30 గంటలకు కవాట బంధనం
- సంప్రోక్షణ అనంతరం నేటి ఉదయం 8 గంటల నుంచి భక్తులకు దర్శనాలు



రుషికొండలో శ్రీవారి ఆలయం తలుపులు మూసివేస్తున్న టీటీడీ అర్చకులు, సిబ్బంది



సింహాచలం కొండ కింద వెంకన్న ఆలయం

సింహాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం ఉదయం 11.30 గంటలకు మూసివేశారు. భక్తులకు దర్శనాలు నిలిపివేసి, రాజభోగ నివేదన, రాత్రి ఆరాధన, పవళింపు సేవలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన ద్వారం నీలాద్రి గుమ్మం తలుపులు, తరువాత ధ్వజస్తంభం వద్ద ఉన్న గరుడ మండపం ద్వారం తలుపులు, అలాగే ప్రధాన రాజగోపురానికి ఉన్న తలుపులను పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో స్థానాచార్యులు డా. టీపీ రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, అధికారులు మూసి వేసి తాళాలు వేశారు. సోమవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం గ్రహణ సంప్రోక్షణలు చేసి దేవాలయాన్ని గంగధార శుద్ధ జలాలతో శుభ్రపరచడానికి ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం ప్రభాతారాధనలు జరిపి భక్తులకు ఉదయం 8 గంటల నుంచి దర్శనాలు కల్పించనున్నట్టు అధికారులు ప్రకటించారు. అలాగే సింహాచలం దేవస్థానం పరిధిలో ఉన్న ఉపాలయాలను కూడా మూసివేశారు.సింహగిరి క్షేత్రపాలకుడు బాలత్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి, గంగధార సమీప సీతారామస్వామి దేవళం, రాజగోపురానికి చేరువలోని కాశీవిశ్వేశ్వర పంచాయతన దేవాలయం, కొండదిగువ పూదోటలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, గ్రామ దేవతలు పైడితల్లెమ్మ, బంగారమ్మ ఆలయాలను ప్రభాతారాధనలు పూర్తి చేసిన తరువాత అర్చకులు మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం నుంచి ఆలయాలను తెరవనున్నారు.

రుషికొండ టీటీడీ ఆలయం..

సాగర్‌నగర్ : రుషికొండలో ఉన్న మహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తామని అధికారులు చెప్పారు.

రుషికొండపై గోవా గవర్నర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం

- అశోక్ గజపతిరాజును మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలి
- శాసనమండలి విపక్ష నేత బొత్స



విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుషికొండ భవనాలను మానసిక చికిత్సాలయం (మెంటల్ హాస్పిటల్)గా మార్చాలని గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడడం ఆయన మానసిక స్థితిని తెలియజేస్తున్నదన్నారు.రాచరికపు పోకడలు, అహంకారం, రాజకీయ దుర్బుద్ధితో మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజును ముందు మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలని డిమాండ్ చేశారు. రుషికొండ భవనాలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పరిశీలించినపుడు సీలింగ్ ఊడిపోయిందని మీడియాకు చూపించారని, అది ఊడిపోయిందో.. ఊడగొట్టారో నిర్ధారించుకోవాలని ప్రభుత్వానికి హితవుపలికారు. ఒకవేళ ఊడిపోతే నాసిరకమైన సామాగ్రిని వాడినట్టే కాబట్టి, కూటమి ప్రభుత్వ హయాంలోనే సంబంధిత కాంట్రాక్టర్‌కు చెల్లింపులు జరిపినందున అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. రుషికొండ భవనాలను ఏం చేయాలో తెలియడం లేదని చెబుతున్నారని, సీఎం పర్యటనకు నోవాటెల్, రాడిసన్‌బ్లూ హోటల్‌కు గత ఏడాది కాలంలో ఇచ్చినబిల్లులు చూస్తే ఆయా కార్యక్రమాలకు దీనినే ఎందుకు వాడుకోకూడదనేది తెలుస్తుందన్నారు. అలాచేసినా, లేదంటే ఎవరికైనా వేలం ద్వారా లీజుకు ఇచ్చినా ఏడాదికి రూ.25 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందన్నారు. ఇది ప్రభుత్వానికి తన ఉచిత సలహా మాత్రమేనన్నారు. రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రశ్నిస్తే ప్రభుత్వంలోని పెద్దలు బెదిరిస్తున్నారని బొత్స ఆరోపించారు. బెదిరింపులకు ఎవరూ భయపడిపోరని, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకి అప్పగించాలని చంద్రబాబు నిర్ణయించారని, వీటిని వారి అనుయాయులకు వాటిని కట్టబెట్టేందుకేనని బొత్స అనుమానం వ్యక్తంచేశారు. గత 14 నెలల్లో రూ.2 లక్షల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వం.. వైద్య కళాశాలలకు రూ.6 వేల కోట్లు కేటాయించలేదా? అని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై ఈ నెల తొమ్మిదిన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని బొత్స పేర్కొన్నారు.

నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లకు అభినందనలు

మధురవాడ/భీమునిపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు మధురవాడకు చెందిన నాగోతి సూర్యప్రకాశరావు రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యప్రకాశరావు విశాఖ పార్లమెంట్ టీడీపీ కార్యదర్శిగా, మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈమేరకు శనివారం ఆయన ఎమ్మెల్యే గంటాను నగరంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే భీమునిపట్నానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పోతిన అప్పలరాజు కూడా నగరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన కూడా గంటాను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిద్దరిని గంటా అభినందించారు.

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను నిరసిస్తూ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ, సీపీఎం నాయకులు

తగరపువలస, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సీఐటీయూ నాయకులు తగరపువలసలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. చిట్టివలస ఫుట్‌బాల్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ కార్మికవాడ, తగరపువలస కూడలి, మెయిన్ రోడ్డు మీదుగా ప్రైవేటు మార్కెట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణకు అందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈనెల 11న పాత గాజువాకలో జరిగే బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. అలాగే ఇళ్లకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్టు మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ ఎస్ఎన్ మూర్తి, ఎస్. అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంలో సాయి శ్రీనిజ ప్రతిభ

ఆనందపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వేములవలసకు చెందిన కొండవీటి సాయి శ్రీనిజ 2023 - 24 విద్యా సంవత్సరానికి గాను ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం నిర్వహించిన బీఏఎం (బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ) కోర్సులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు సబ్జెక్టుల్లో ఆమె టాపర్‌గా నిలిచి డాక్టర్ నోరి రామశాస్త్రి ఆయుర్వేదిక్ కళాశాల బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా ఎంపికైనట్టు ఎన్టీఆర్ యూనివర్సిటీ ప్రకటించింది. ఈమేరకు ఈనెల 9న విజయవాడలో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవ సభలో మూడు గోల్డ్, ఒక సిల్వర్ మెడల్ అందుకోనుంది.

13న కార్మిక పింఛన్‌దారుల నిరసన

తగరపువలస, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కార్మిక పింఛన్‌దారుల సమస్యలపై ఈనెల 13న విజయవాడలో నిరసన చేపట్టనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె. రాంబాబు తెలిపారు. ఆదివారం తగరపువలసలో జరిగిన జూట్‌మిల్లు పింఛన్‌దారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస పింఛన్ పెంపుదల, రైల్వే ప్రయాణాల్లో రాయితీలు పునరుద్ధరణ, ఇతర సమస్యల సాధన కోసం ఉద్యమించనున్నట్టు తెలిపారు.

బీచ్‌లను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాక్షినగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలతో వచ్చిన చెత్తను వెంటనే తొలగించాలని జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావును ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఆమె జోడుగుళ్లపాలెం తీరాన్ని పరిశీలించారు. నిమజ్జనాల వల్ల తీరంలో చేరిన చెత్తను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

నిర్మానుష్యంగా భీమిలి బీచ్

భీమునిపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వీకెండ్‌కు పర్యాటకులతో రద్దీగా ఉండే భీమిలి బీచ్ ఆదివారం నిర్మానుష్యంగా మారింది. వాతావరణం మబ్బులతో ఉండడం, చంద్ర గ్రహణం వల్ల సందర్శకుల తాకిడి ఈ వారం తగ్గింది. సాయంత్రం ఆరు గంటలకే బీచ్ నిర్మానుష్యంగా మారింది.

నాన్‌స్టాప్ కౌంటర్లు ఖాళీ

... 5వ పేజీ తరువాయి

సర్వీసులున్నాయి. వీటితో పాటు ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసులు నడుస్తున్నాయి. వీటిలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంది. ఒకే కుటుంబానికి చెందిన పురుషులు ఒక బస్సులో, మహిళలు మరో బస్సులో ప్రయాణించేందుకు ఇష్టపడకపోవడంతో అందరూ ఈ ఐదురకాల బస్సులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద జనం కనిపించడం లేదు. సాధారణంగా శ్రీకాకుళానికి ప్రతి 30 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ సర్వీస్ నడుస్తుంది. నర్సీపట్నానికి 50 నిమిషాల వ్యవధిలో, కాకినాడ, రాజమండ్రి గంట వ్యవధితో షెడ్యూల్ సర్వీసులు ఉన్నాయి. అయితే బస్సులు బయలుదేరే సమయానికి వీటిలో 30 శాతానికి మించి ఆక్యుపెన్సీ రావడం లేదు. దీంతో కొన్నింటిని రద్దు చేసి బస్సుల మధ్య వ్యవధి పెంచారు. శ్రీకాకుళం నాన్‌స్టాప్‌లను 30 నిమిషాల నుంచి 45 నిమిషాలకు, నర్సీపట్నానికి 50 నిమిషాల నుంచి 1.10గంటలకు, రాజమండ్రి, కాకినాడలకు గంటనుంచి గంటన్నర వ్యవధితో బస్సులు నడుపుతున్నారు. అయినా ఆక్యుపెన్సీ రేషియో 40 శాతానికి మించి రావడం లేదని అధికారులు వాపోతున్నారు. స్త్రీశక్తి పథకం అమలు ప్రభావం నాన్‌స్టాప్ సర్వీసులపై పడిందని చెబుతున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పద్మనాభంలో ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు

తగరపువలస, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు అనంతరం మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన ఐదుగురు ఉపాధ్యాయుల్ని సన్మానించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం దొడ్డి ఆదినారాయణ అధ్యక్షత వహించారు. సన్మానం పొందిన వారిలో కె. జగన్నాథం, కె. అప్పలసూరి, కె. సునీత, రెడ్డిపల్లి అప్పలరాజు, జి. చిన్నయ్య ఉన్నారు.

భీమునిపట్నం చర్చిలో...

భీమునిపట్నం : పట్టణంలోని సెయింట్ పీటర్స్ చర్చిలో ఆదివారం టీచర్స్ డే వేడుకలు ఘనం గా నిర్వహించారు. నిర్వాహకులు పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, పాస్టర్ చైతన్యకుమార్,ఉపాధ్యాయులు విజయభారతి, చంద్రకుమారి పాల్గొన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రజాప్రతినిధులు, అధికారులు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీపీ రాంబాబు మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధికంగా పద్మనాభం మండలం నుంచి 12 మంది ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన వారితో పాటు తొమ్మిదిమంది రిటైర్డు ఉపాధ్యాయులు సహా 45 మందిని ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంఈఓలు రమణ, బాబూలాల్ సత్కరించారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ఆరు వాహనాలు సీజ్

సింహాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని కొన్ని చికెన్ దుకాణాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న ఆరు వాహనాలను పాత అడివివరం కూడలిలో జీవీఎంసీ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. 97వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, వెటర్నరీ ఇన్‌స్పెక్టర్ కె. జగ్గారావు సిబ్బందితో కలిసి అడివివరం వైపుగా వస్తున్న నాలుగు వాహనాలను, శొంఠ్యాం కూడలి వద్ద రెండు వాహనాలను పటుకున్నారు. డ్రైవర్ల వద్ద నిబంధనల ప్రకారం ఉండాల్సిన జీయో ట్యాగ్ కాని, జీవీఎంసీ అనుమతి పత్రాలు కాని లేకపోవడంతో అక్రమ రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. డ్రైవర్లను ప్రశ్నించగా రాజమండ్రి వైపు కోళ్ల వ్యర్థాలను తీసుకువెళ్తున్నట్టు చెప్పారు. కాగా ఆరు వాహనాల్లో ఒక వాహనాన్ని డ్రైవర్ తుప్పల్లో విడిచిపెట్టి పారిపోయారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరు వాహనాలను అధికారులు ముడసర్లోవలోని డంపింగ్ యార్డుకు తరలించి, సీజ్ చేశారు.

జిల్లా స్విమ్మింగ్ సంఘం నూతన కార్యవర్గం

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. బీచ్‌రోడ్డు ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరిగిన ఎన్నికలలో అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్ శెట్టి, కార్యదర్శిగా జి.శ్రీరామమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.మోహన వెంకటరామ్, కోశాధికారిగా ఎన్.రఘునాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.రామారావు, డి.లక్ష్మి సింధు, విజయ్‌కుమార్ నటరాజన్, కె.రవికుమార్, పరవాడ ఈశ్వరరావులు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఎస్.శ్రీధర్, బీవీఎస్ఎన్.ఎర్రాజి, జాన్ జీవన్‌కుమార్ రంధి (రైల్వేస్), ఈగల హేమంత్ కుమార్ (రైల్వేస్), పి.రమేష్‌లు ఎన్నికయ్యారు. మరో ఏడుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారని నూతన కార్యదర్శి జి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర స్విమ్మింగ్ సంఘం కోశాధికారి ఐ.రమేష్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నుంచి పి.శైలజ, ఒలింపిక్ సంఘం నుంచి ఐ.వెంకటేశ్వరరావు పర్యవేక్షకులుగా, ప్రముఖ న్యాయవాది బాలాజి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు శిరీష ఎంపిక

పద్మనాభం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన చలపాక శిరీష రాష్ట్రస్థాయి యోగా ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ద్వారకా తిరుమలలో ఈనెల 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. శిరీష ప్రథమ స్థానం కైవసం చేసుకొంది. ఆమెకు నిర్వాహకులు ప్రశంసాపత్రం, మెడల్ బహూకరించారు. త్వరలో మైసూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొనున్నారు.

జీవీఎంసీలో అవినీతి రాకెట్!

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదులు గుప్పించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియోజకవర్గం పరిధిలో ప్రజారోగ్య విభాగంలో కొందరు పనిచేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని, దీనిపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదుచేశారు. దీనిపై జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు వివరణ ఇస్తూ అలాంటిదేమీ లేదని, అందరూ కచ్చితంగా పనిచేస్తేనే జీతాలు అందుతాయని చెప్పడంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గంట సమయం ఇస్తానని, ఎమ్మెల్యే చెప్పిన పది మంది కార్మికులు ఎక్కడెక్కడ విధులు నిర్వర్తించారనే దానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉంటే తీసుకురావాలని ఆదేశించారు. కానీ జోనల్ కమిషనర్ వాటిని తీసుకురాలేకపోవడంతో జీవీఎంసీ పనితీరుపై తీవ్రస్థాయిలో ఇన్‌చార్జి మంత్రి ఆరోపణలు గుప్పించారు. జీవీఎంసీలో కొంతమంది సర్వేయర్లు ప్రైవేటు వ్యక్తులకు అనుకూల నివేదికలిస్తున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యేలు పలుమార్లు ప్రస్తావించారని, చీఫ్ సిటీప్లానర్ సమావేశానికి రాకపోవడంతో చాలామంది ఎమ్మెల్యేలు తమ ఫిర్యాదులను బయటపెట్టలేకపోయారన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి జరుగుతున్న సమాచారం తన వద్ద ఉందన్నారు. పెద్దఎత్తున నిధులను కొల్లగొట్టే రాకెట్ నడుస్తోందని, త్వరలోనే దీనిని బయటకు తీస్తానని హెచ్చరించినట్టు కొందరు ఎమ్మెల్యేలు చెప్పడం చర్చనీయాంశంగా మారింది. జీవీఎంసీలో కొంతకాలంగా రాత్రిఫుడ్‌కోర్టుపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. కౌన్సిల్ మీటింగ్ జరిగిన ప్రతి సారీ ఫుడ్‌కోర్టును తొలగించాలని సభ్యుడు డిమాండ్ చేయడం, తక్షణం తొలగించాలని మేయర్ ఆదేశాలు ఇలివ్వడం పరిపాటిగా మారింది. దీనివెనుక కొందరు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కోడివ్యర్థాలను చేపల చెరువులకు తరలింపు అంశంపై కార్పొరేటర్లు, ఎమ్మెల్యేల మధ్య పెద్దయుద్ధమే జరుగుతోంది. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో సర్వేయర్లు ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా నివేదికలను ఇచ్చి పార్కులు, గెడ్డలను అన్యాక్రాంతం చేస్తున్నారని చెబుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో కొందరు అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వారికి అనుకూలంగా అంచనాలు తయారుచేయడం, టెండర్లను అస్మదీయులకు వచ్చేలా సహకరించి, భారీగా జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. యూసీడీ విభాగంలో మహిళా సంఘాల ఆడిట్ పేరుతో సిబ్బంది పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులున్నాయి. వీటన్నింటిపైనా ఇన్‌చార్జి మంత్రికి పూర్తి సమాచారం అందడంతోనే జీవీఎంసీలో అవినీతి రాకెట్ నడుస్తోందని వ్యాఖ్యానించి ఉంటారనే అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యాఖలు జీవీఎంసీలోని కొందరు అధికారుల్లో గుబులురేపుతున్నాయి. ఏక్షణంలో సమీక్ష పేరుతో జీవీఎంసీకి వచ్చి తమ అవినీతి, అక్రమాలను నేరుగా బయటపెడతారోనని ఆందోళన చెందుతున్నారు.

ఉలిక్కిపడిన నగరం

... 5వ పేజీ తరువాయి

ట్యాంకులోపల, చుట్టూ మంటలు అంటుకున్నాయి. ట్యాంకు చుట్టూ మంటలను సుమారు ఎనిమిది గంటలు శ్రమించి ఆర్పేశారు. ట్యాంకు లోపల మంటలు అదుపుచేయడం అంత సులువుకాదు. మిథనాల్‌ను ట్యాంకు అడుగు భాగం నుంచి పైపు ద్వారా మరో ట్యాంకుకు తోడుతున్నారు. అదే సమయంలో ట్యాంకుపైన అంటుకున్న మంటలను అదుపు చేస్తున్నారు. సోమవారం ఉదయానికి మంటలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. కాగా మిథనాల్‌కు మండే స్వభావం ఉన్నా మంటల వల్ల కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, ఆక్సిజన్(నీటి ఆవిరి)గా మారుతున్నందున కొంత వరకు ప్రమాదం తగ్గుతుందని నిపుణులు వ్యాఖ్యానించారు. ఈస్టిండియా కంపెనీలో ప్రమాదం సంభవించిన వెంటనే ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు, పోలీసులు, కాలుష్య నియంత్రణమండలి అధికారులు సందర్శించారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఇన్‌చార్జి ఫైర్‌డీజీ వెంకటరమణ సందర్శించి పరిస్థితి సమీక్షించారు. స్టోరేజీకి ఎప్పటికప్పుడు అనుమతులు ఇస్తుంటామని కాలుష్య నియంత్రణమండలి ఈఈ ముకుందరావు తెలిపారు.

నగరంలో పిడుగులు సాధారణమే..

జనావాసాలకు దూరంగా పిడుగులు పడుతుంటాయి. అయితే ఒక్కోసారి తీవ్రమైన పిడుగులు నగరంలో ఖాళీ ప్రదేశాలు, ఎత్తైన చెట్లు/ టవర్లపై పడుతుంటాయి. పారిశ్రామిక కార్యకలాపాలు జరిగే ప్రాంతంలో ఆదివారం పిడుగు పడడం సాధారణమేనని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు. మిచాంగ్ తుఫాన్ సమయంలో చినవాల్తేరులోని తుఫాన్ హెచ్చరిక కేంద్రం సమీపంలో ఎత్తైన తాటిచెట్లపై పిడుగు పడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఏయూ ఉన్నత పాఠశాల సమీపంలో పిడుగు పడడంతో రెండు చెట్లు కాలిపోవడం చాలామంది చూసే ఉంటారన్నారు. పిడుగుల తీవ్రత ఏటా పెరుగుతుందని, ప్రజలు నిరంతరం విద్యుత్ వాడుతుంటారని, పిడుగులు పడే వాతావరణం ఉన్నప్పుడు టీవీలు, సెల్‌ఫోన్లు ఆఫ్ చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, వాటిని వాడితే పిడుగు తీవ్రత పెరుగుతుందన్నారు.

దర్జాగా కబ్జా

... 5వ పేజీ తరువాయి

ఉందంటున్నారు. కళాశాల చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల చుట్టూ కంచె ఏర్పాటుచేసి హెచ్చరిక బోర్డులు పెట్టాల్సి ఉంది.

నిర్మాణాలు ఆపించాం

విశాఖ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని సర్వే నంబరు 58లో ప్రభుత్వ భూమి ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించాం. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. వారు ఆదేశాలు జారీచేసిన వెంటనే తొలగింపు చర్యలు చేపడతాం.

- జి.విజయం, వీఆర్వో, నరవ

స్వామి సన్నిధిలో 'కల్యాణం' కలేనా?

- పెదవాల్తేరులోని వెంకటేశ్వరుడి ఆలయంలో శిథిలావస్థలో కల్యాణ మండపం
- నిధులు మంజూరైనా జరగని పునర్నిర్మాణం
- వివాహాలు జరుపుకోవడానికి కూడా అవకాశం లేకపోతోందంటూ భక్తుల ఆవేదన



శిథిలావస్థలకు చేరిన వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణ మండపం



పెచ్చులూడుతున్న పై కప్పు



కూలడానికి సిద్ధంగా ఉన్న మెట్లు

పెదవాల్తేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న దేవాలయాల్లో ఒకటి పెదవాల్తేరులోని వేంకటేశ్వరస్వామి దేవాలయం. గతంలో నిధులు విడుదలైనా పనులు జరగకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు. దీనిపై పలు విమర్శలు ఉన్నాయి. దేవుడి సన్నిధిలో వివాహాలు చేద్దామన్నా.. అవకాశం లేకుండా పోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తూర్పు నియోజకవర్గంలోని పెదవాల్తేరు, చినవాల్తేరు, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లో ఈ దేవస్థానానికి చెందిన ఐదు ఉప ఆలయాలు ఉన్నాయి. ఇందులో నాలుగు దేవస్థానాల్లో కల్యాణమండపాలు ఉన్నాయి. గతంలో రెండు కల్యాణ మండపాల నిర్మాణలను పనులు చేపట్టారు. ఒకటి పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ దేవస్థానం కల్యాణ మండపంపై రెండో అంతస్తు నిర్మాణలను పనులు చేపట్టి పూర్తి చేశారు. రెండోది చినవాల్తేరులోని కనకమహాలక్ష్మి (దుర్గా) అమ్మవారి దేవస్థానంలో కల్యాణమండపం పనులు పూర్తి చేశారు. కానీ పెదవాల్తేర్ లాసన్స్ బే కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం అవరణలో కల్యాణమండపం శిథిలావస్థకు చేరుకొంది. కల్యాణ మండపం పనులు ఎప్పుడు తలపెట్టతారో గాని ఇప్పటికీ ఒక కలిక్కి రాకపోవడం గమణార్హం. ఏళ్ల తరబడి పనులు జరగకపోవడంతో తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. విడుదలైనా పనులు ఎందుకు చేయడం లేదో ఎవరికీ అంతు బట్టడం లేదని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవుని సన్నిధిలో వివాహాలు చేసుకుందామన్నా అవకాశం లేకుండాపోతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వేంకటేశ్వర స్వామి దేవస్థానం అవరణలో కల్యాణ మండపం శిథిలావస్థకు చేరుకొంది. ఎక్కడ ఎడితే అక్కడ పెచ్చులు ఊడుడిపోతున్నాయని భక్తులు అంటున్నారు. కొన్నిసార్లు దర్శనాలకు వచ్చిన భక్తులపై కూడా పెచ్చులు పడిన ఉదంతాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటకైనా దేవదాయ శాఖ అధికారులు, కల్యాణ మండపం పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కల్యాణ మండపంతో పాటు ఈవో కార్యాలయం, అర్చకులు నివాసాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు పడిపోయోనన్న దుస్థితికి చేరడంతో అంతా ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకునే నాథుడే లేడాయె..

పెదవాల్తేరులోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి ఏళ్ల చరిత్ర ఉంది. ఈ దేవస్థానం అవరణలోని పాత కల్యాణమండపం స్థానంలో కొత్త కల్యాణ మండపం నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. కొత్త కల్యాణ మండపం నిర్మాణానికి గతంలో శంకుస్థాపన కూడా చేశారు. ముందుగా కల్యాణమండపం పై అంతస్తు నిర్మించాలని తలపెట్టారు. కానీ గతంలో దేవస్థానం అధికారులు ఏయూ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆధికారులతో సర్వే చేయించారు. అయితే పాత కల్యాణమండపం భవనం పూర్తిగా తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. దీంతో గతంలో ప్లాను మార్చాల్సి వచ్చింది. అందుకే నిర్మాణంలో జాప్యం జరుగుతోందని దేవస్థానం వర్గాలు చెబుతున్నాయి. ఇదేదో ముందుగానే చూసుకుంటే సరిపోయేది కదా అని స్థానికులు, భక్తులు అంటున్నారు. ఇప్పటికే పాత కల్యాణమండపం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడ శుభకార్యాలు చేసుకోవడానికి భక్తులు భయపడిపోతున్నారు. ఈ కల్యాణమండపం పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో ఎవరికీ తెలియని అయోమయం నెలకొంది. వర్షాలకు కల్యాణ మండపం పూర్తిగా తడిసిపోయింది. ఎప్పుడు ఈ కల్యాణమండపం కూలిపోతుందోనని స్థానికులు, భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

చంద్రగ్రహణం ఎఫెక్ట్..

పలు ఆలయాల మూసివేత



మూసివేసిన సంపత్ వినాయగర్ ఆలయం

సిరిపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా సంపత్ ఆదివారం నగరంలోని పలు ఆలయాలను తాత్కాలికంగా మూసి వేశారు. ఆశీల్‌మెట్ట లోని వినాయగర్ ఆలయం మూతవేశారు. దేవాలయంలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సంప్రదాయద్ధంగా అర్చనలు, పంచామృతాభిషేకాలు పూర్తి చేసి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు మంగళహారతులు సమర్పణగావించి దేవాలయాన్ని మూసివేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలన్నీ పూర్తి చేసి తలుపులు మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు యథావిధిగా గణపతి హారతి, మహా సంప్రోక్షణం జరిపించి, ఉదయం 7 గంటల నుంచి భక్తులకు దర్శనాలకు అవకాశం కల్పిస్తామని ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు.

కరకచెట్టు పోలమాంబ ఆలయం..

పెదవాల్తేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవాలయం, లాసన్స్ బే కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, చినవాల్తేరులోని శ్రీకనక మహాలక్ష్మి (దుర్గా) అమ్మవారి దేవాలయం, చినవాల్తేరులోని జగన్నాథ స్వామి దేవాలయాల్లో ఆదివారం తెల్లవారు జామున సంప్రదాయ కార్యక్రమాలు పూర్తి చేసి భక్తులకు ఉదయం నుంచి పదకొండున్నర వరకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం దర్శనాలు నిలిపివేశారు. ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి సోమవారం ఉదయం 9:00 గంటల వరకూ ఆలయం మూసివేస్తున్నట్టు శ్రీపోలమాంబ అమ్మవారి దేవాలయం ఈవో కె.గాయత్రి తెలిపారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం దేవాలయం ఉదయం 9:00 గంటల తర్వాత భక్తులకు దర్శనం కల్పించనున్నట్టు ఆమె తెలిపారు.



మూసివేసిన కరకచెట్టు పోలమాంబ ఆలయం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎన్టీఏ ముందంజ

- ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

పెందుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) ముందంజలో ఉందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. ఎన్‌టీఏ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి సమావేశాన్ని ఆదివారం పెందుర్తిలో గల టీటీడీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను చేపట్టిన ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను చేపడుతుందన్నారు. విద్య ప్రాధాన్యం, విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులను మంత్రి నారా లోకేశ్ కేటాయించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, రాష్ట్రంలో 85 శాతం మంది ఉపాధ్యాయులు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు హయాంలోనే డీఎస్సీల ద్వారా కొలువులు సాధించారన్నారు. ఎన్టీఏ జిల్లా అధ్యక్షుడు టీవీ రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బొనిగెల హైమారావు, నాయకులు జె.శ్రీనివాసరావు, శ్రీదేవి, పెనుమత్స కృష్ణంరాజు, నక్కా శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వలలకు పుష్కలంగా చిక్కిన మత్స్యసంపద



కిటకిటలాడుతున్న చేపల రేవు

బీచ్‌రోడ్డు, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో మత్యకారుల వలలకు ఆదివారం పుష్కలంగా వివిధ రకాల చేపలు లభ్యమయ్యాయి. రొయ్యలు, పీతలు కానగడితలు, పారలు తదితర పలు రకాల చేపలు అధిక సంఖ్యలో చిక్కాయి. వేల రూపాయలు విలువ చేసే ఈ మత్స్య రాశులను విక్రయించేందుకు ఫిషింగ్ హార్బర్‌కు తరలించారు. ఆర్థికంగా ప్రయోజనం చేకూరడంతో జాలర్లు ఆనందం వ్యక్తం చేశారు.

కూటమి హయాంలో రజకులు అన్ని రంగాల్లో అభివృద్ధి

- 'రజకుల ఆకాంక్ష సభ-2'లో రాష్ట్ర మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, కొల్లు రవీంద్ర



వేదికపై మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు పంచకర్ల, ఎస్.ఈశ్వరరావు (ఎచ్చెర్ల), పి.విష్ణుకుమార్‌రాజు,వంశీకృష్ణశ్రీనివాస్, ఎమ్మెల్సీచిరంజీవిరావుతదితరులు

సిరిపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో రజకులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి సాధించేందుకు పూర్తి అవకాశాలు కలిగిస్తున్నామని రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షతన 'రజకుల ఆకాంక్ష సభ-2 ప్రభుత్వ పథకాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు తొలుత సంత్‌గాడ్గే, మావిడాల మాచయ్య, వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రజకులకు ఐకృత అవసరమన్నారు. ప్రభుత్వం వారి కోసం తీసుకొచ్చే జీవోలను అడిగి మరీ అమలు చేయించుకోవాలని సూచించారు. రజకుల జీవన పరిస్థితులు ఇంకా వెనుకబాటుగా ఉండటం బాధకరమన్నారు. కుల వృత్తులను రిజర్వ్ చేయడంతో పాటు, హోటల్స్ టూరిస్ట్ రిసార్టులలో దోబీ పనిని హక్కుగా కల్పించేలా ప్రత్యేక చట్టం రావాల్సి ఉందన్నారు. రజకులను ఎస్సీల్లో చేర్చే తీర్మానాన్ని టీడీపీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రజక సామాజిక వర్గానికి ఒక ప్రత్యేకస్థానం ఉందన్నారు. నిజం చెప్పాలంటే నేను కూడా నన్ను రజక వర్గానికి చెందినవాడిగానే భావిస్తానన్నారు.తమ ఇంట్లో ఓ సోదరి నాకు ఇస్త్రీ చేయడం నేర్పించిందన్నారు. కొన్నేళ్లపాటు నేనే ఇస్త్రీ చేసుకున్నానన్నారు. బలహీనవర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలను ముందుకు తెచ్చిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దోబీల నియామకానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు రూపొందించిన చట్టాల ద్వారా హక్కులను సాధించుకోవాలని సూచించారు. గతంలో బలహీనవర్గాల నేతలపై దాడులు జరిగాయని అన్నారు.త్వరలోనే బీసీ రక్షణ చట్టం రానుందని హామీ ఇచ్చారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. నైపుణ్య శిక్షణలు అందించి స్వయం ఉపాధి దిశగా సహకారం అందిస్తామన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ చదువు వల్లే దారిద్ర్యానికి విముక్తి లభిస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టా సారించాలని సూచించారు. కులవృత్తులను గౌరవిస్తూనే ఆధునికతో కలిపి ముందుకు తీసుకెళ్లాలన్నారు. రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ హక్కుల సాధనలో అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ హక్కుల సాధనకు రాజకీయమేమార్గమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రజకుల సంక్షేమం కోసం టీడీపీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రజకులకు ఎస్సీ హోదాపై చర్చ జరుగుతుందన్నారు. ఈ అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ల కమిటీ అధ్యయనం చేసినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణశ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, బీజేపీ నేత పి.పరశురామ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు మెరుగైన చికిత్సే లక్ష్యం

- మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ



వేడుకలను ప్రారంభిస్తున్న ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి. మురళీకృష్ణ

విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్న లక్ష్యంతో 20 ఏళ్ల కిందట ఆస్పత్రి ఏర్పాటు చేశామని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ అన్నారు. ఆస్పత్రి ఏర్పాటు చేసి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పీఎంపాలెంలోని వి. కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రి ప్రయాణంలో ఇదో మైలురాయిగా అభివర్ణించారు. ఇన్నేళ్ల ప్రస్థానంలో కొన్నిలక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నా మని చెప్పారు. శ్రేయా కేన్సర్ ఫౌండేషన్ వంటి ఎన్‌జీవోల సహకారంతో ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. 2005లో ఆరు పడలకతో ఏర్పాటైన ఆస్పత్రి ప్రస్తుతం దేశంలోని ప్రముఖ కేన్సర్ ఆస్పత్రుల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీజీ సీవోవో డాక్టర్ మనీశ్ మోట్వో తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు.

సినిమా గైడ్

- అర్జున్ చక్రవర్తి : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- మదరాసి : శ్రీకన్య
- ది కంజూరింగ్-4 : శారద
- ఘాటీ : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- పరదా : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- వార్-2 : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- కూలీ : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- మహావతార్ నరసింహ : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 28, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 24, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 46, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 70, బరబాటి 42, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276

విశాఖలో జైపూర్ రగ్స్ ఉత్సవం

- యోగేష్ చౌదరి

రామ్‌నగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో త్వరలో జైపూర్ రగ్స్ ఉత్సవం నిర్వహించనున్నట్టు జైపూర్ రగ్స్ సంస్థ డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. ఆదివారం గ్రీన్‌పార్కు రోడ్డులోని ఒక హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడుతూ త్వరలో రానున్న శీతాకాలం, నేపథ్యంలో ప్రజలకు రగ్స్ అవసరమవు తాయని, వారికి అవసరమైన గ్రామీణ కళాకారుల ఊహాశక్తి నుంచి ఉతక్తొత్తి చేసిన సంప్రదాయ, ఆధునిక డిజైన్లతో కూడిన 14 వేల రకాలకు పైగా రగ్స్ ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. వందేళ్లకు పైబడిన వింటేజ్ యాంటిక్ రగ్స్ ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నేటి వ్యాపార ఎగుమతి, దిగుమతి పరిస్థితులు మారుతున్న నేపథంలో ఉత్సవం ప్రత్యేక సేవా కార్యక్రమానికి అనుసంధానమై ఉంటుందని తెలిపారు. త్వరలోనే తేదీలు, వేదిక వివరాలు తెలియజేస్తామని ఆయన వెల్లడించారు.

9న అదనపు గదుల స్కూలు భవనం ప్రారంభోత్సవం

- ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న మంత్రి సంధ్యారాణి

ఆరిలోవ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దీనదయాళ్‌పురంలో గల ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంపై నిర్మించిన అదనపు గదుల భవనానికి ఈ నెల 9న ప్రారంభోత్సవం చేపడుతున్నట్టు బాలుర ప్రత్యేక పరిశీలన గృహం పర్యవేక్షణాధికారి అన్నాజీరావు తెలిపారు. ఆయన శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏపీ మహిళా, శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నాజీరావు కోరారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

- 11న గాజువాకలో సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో బహిరంగసభ



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

ఆరిలోవ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీలుప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో ఆదివారం 13వ వార్డులో గల కనకమహాలక్ష్మి నగర్, జైభీమ్ నగర్, రామకృష్ణాపురం ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ ఈ డిమాండ్‌తో గాజువాకలో సెప్టెంబరు 11న గాజువాకలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించవద్దన్నారు. స్టీలు ప్లాంటును 46 ముక్కలుగా విడగొట్టి ఈవోఐ పేరుతో దొడ్డి దారిన ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దీనికి కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని పేర్కొన్నారు. ఈవోఐ పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పని చేసే పాతమీటర్లు ఉండగా, అదాని స్మార్ట్‌మీటర్లు కొత్తగా ప్రతి ఇంటికి బిగించడం అన్యాయం అన్నారు. ఈ పాదయాత్రలో నేతలు ఐసీ నాయుడు బి.రత్నం, ఇ.ఆదినారాయణ, మంగటిరాజు, పి.శంకరరావు, రాగోలు గణపతి, జి.లక్ష్మినారాయణ, సీహెచ్ రాము, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూలో జంతువుల సంతానోత్పత్తి

- బ్లూ గోల్డ్ మకావ్ పక్షికి రెండు పిల్లలు
- ఐదు పిల్లలకు జన్మనిచ్చిన బ్లాక్‌బక్, చౌసింగా అనే జింక జాతి జంతువులు



జన్మనిచ్చిన ఆడ, మగ పిల్లలతో చౌసింగా



ఇంక్యుబేటర్‌లో గుడ్లను పొదిగించడం ద్వారా పుట్టిన బ్లూగోల్డ్ మకావ్ పక్షి పిల్ల

ఆరిలోవ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో బ్లూ గోల్డ్ మకావ్ అనే ఆస్ట్రేలియా జాతికి చెందిన పక్షికి చెందిన రెండు గుడ్ల నుంచి పిల్లలను జైలు అధికారులు కృత్రిమ ఇంక్యుబేటర్‌లలో పొదిగించారు. ఈ ప్రక్రియ విజయవంతమై రెండు రెండు పిల్లలు పుట్టాయి. వీటిని ప్రస్తుతం జూలోని పశువైద్య బృందం హ్యాండ్ రియరింగ్ ద్వారా సంరక్షిస్తున్నారు. ఈ పక్షి పిల్లలు పుట్టడం అనేది జంతు ప్రదర్శనశాలకు సంబంధించి ఒక గొప్ప ముందగుడు అని జూ క్యూరేటర్ జి.మంగమ్మ పేర్కొన్నారు.

అలాగే జింకల జాతికి చెందిన బ్లాక్‌బక్ మూడు పిల్లల్ని, చౌసింగా రెండు పిల్లలకు జన్మనిచ్చినట్టు మంగమ్మ తెలిపారు. వీటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకొంటున్నట్టు ఆమె తెలిపారు.

విశాఖ వైద్యుడికి సర్జన్స్ ఆఫ్ ఇండియా పురస్కారం



డాక్టర్ నారాయణరావుకు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

ఆరిలోవ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ జనరల్ సర్జన్, నారాయణ మెడిసిటీ ఎండీ డాక్టర్ టి.నారాయణరావుకి ప్రతిష్ఠాత్మకమైన అసోషియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా పురస్కారం లభించింది. గుంటూరులోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో మూడు రోజుల పాటు జరిగిన ఆల్ ఇండియా సర్జన్స్‌లో పాల్గొన్న డాక్టర్ టి.నారాయణరావు 'డాక్టర్ కొంపెల్ల సూర్యనారాయణ మూర్తి ఉపన్యాసం'పై ప్రసంగించారు. దేశంలో ఊబకాయం పెనుముప్పుగా తయారైందని ఆందోళనవ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ ఫాస్ట్‌ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారం, అధిక స్థాయిలో చక్కెర, కార్బోహైడ్రేట్స్ కలిగిన ఆహారం తీసుకోవడం సాధారణంగా మారిందన్నారు. ప్రతీ ముగ్గురిలో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నారని వివరించారు. ప్రధానంగా మహిళలు, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారు ఊబకాయం బారినపడుతున్నారన్నారు. దీనివల్ల 40 శాతం మందికి మధుమేహం, 50 నుంచి 70 శాతం మందికి కాలేయ సంబంధిత సమస్యలు, గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, క్యా న్సర్ ప్రమాదం పొంచి ఉంటోందన్నారు. తగిన వ్యాయామం, ఆరోగ్యకర ఆహారపు అలవాట్లతో ఊబకాయాన్ని దరిచేరకుండా చూసుకోవచ్చని వివరించారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఇండియా ఏపీ చాప్టర్ ప్రతినిధులు డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఫణిమహేష్ రెడ్డి తదితరులు డాక్టర్ నారాయణరావుకి పురస్కారంతో పాటు జ్ఞాపికను అందజేశారు.



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం మూసివేత

మహారాణిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం శ్రీచక్ర నవావర్ణార్చన లక్ష్మీ హోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా వేదపండితులు, అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పంచామృతాభిషేకం, మహానివేదన సమర్పించారు. చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ, పంచామృతాభిషేకం, బాలభోగ నివేదన అనంతరం భక్తుల దర్శనానికి అవకాశం కల్పిస్తారు.

ఐటీఐ అభ్యర్థులకు అప్రెంటిస్ మేళా నేడు

కంచరపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు సోమవారం ప్రధాని నేషనల్ అప్రెంటిస్ మేళాను నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేళాలో ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్థాన్ షిప్‌యార్డు, ఆల్ ఇండియా రేడియో, మేథా సర్వో డ్రైవ్స్, జయభారతి ఆటో మొబైల్స్ తదితర ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొని యువతకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తారు. ఐటీఐ కోర్సులు పూర్తిచేసి అప్రెంటిస్ పూర్తిచేయని అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చునన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. అర్హత గల ఐటీఐ అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు అన్నీ ధ్రువపత్రాలతో కంచరపాలెం పాత ఐటీఐ వద్దకు హాజరుకావాలని శ్రీకాంత్ సూచించారు.

బాడీ బిల్డర్‌కు ఆర్థిక సాయం



డబ్బులు అందజేస్తున్న సంఘ సభ్యులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బాడీ బిల్డర్ రాంబాబుకు విశాఖ జిమ్ ఓనర్స్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు కిలాని గణేష్, ప్రధాన కార్యదర్శి బి.కోటిరెడ్డి, సభ్యులతో కలిసి ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. ఇళ్లకు వెళ్లి వ్యక్తిగత శిక్షకునిగా ఎంతోమంది శరీరాకృతులను మార్చి వారిని ఆరోగ్యవంతులుగా తయారు చేసిన రాంబాబు స్నానాల గదిలో పడిపోయి తలకు దెబ్బ తగలడంతో పక్షవాతం బారిన పడ్డాడన్నారు. తన భార్య, కుమార్తెతో అక్కయ్యపాలెంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఆశ్రయం పొందుతున్నాడని చెప్పారు. రాంబాబు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మాధవధార, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాధవధార హైస్కూలు వద్ద రామాలయంలో కొలువైన లలితాదేవి మందిరంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి తెలిపారు. ఉత్సవ వివరాలు తెలిపే పోస్టరును ఆవిష్కరించి పూజా కార్యక్రమాల వివరాలు ప్రకటించారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 10 రోజులు అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలియజేశారు. మహిళలకు సామూహిక కుంకుమ పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కొత్త ఆలయ ప్రాంగణంలో అన్ని వసతులు సమకూర్చనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీప్రధాన కార్యదర్శి ఎస్.వరప్రసాద్, అర్చకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం, క్రీడాధికారులు, క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే ఆదివారం ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ నిర్వహించింది. స్పోర్ట్సు ఆఫీసర్ హరినాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష చేపట్టిన ఈ కార్యక్రమంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా పాల్గొని రైల్వే క్రీడాకారులు, ఉద్యోగులను ఉత్సాహపరిచారు. డీఆర్ఎం బంగ్లా నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ 'శారీరక పటుత్వ సాధనకు రోజూ అరగంట కేటాయించండి' నినాదంతో ప్రతి ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రచారంలో భాగంగా వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. డీఆర్ఎం బంగ్లాలో ఈకార్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా, ఇతర ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు ఆసనాలు సాధన చేశారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైల్వేన్యూకాలనీ సుబ్బలక్ష్మినగర్‌లో వేంచేసిన చింతామణి గణపతి ఆలయం సన్నిధిలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీవీఎస్ఎల్ రాజు పాల్గొన్నారు.

సమాజ సమానత్వానికి అన్ని మతాలు కలిసి పనిచేయాలి

» ఆచార్య బాల మోహన్‌దాస్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్ దాస్

సీతమ్మధార, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సమానత్వం కోసం అన్ని మతాలు కలిసి పనిచేయాలని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పిలుపునిచ్చారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల్లోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో బి.వి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మనీ, గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో పవిత్ర ప్రవక్త హజరత్ మహ్మద్ 1500వ జన్మ వార్షికోత్సవం, మిలాద్ ఉన్ నబీని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ ఛైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో 11 శాతం ముస్లింలు ఉన్నారని, వారి అయిదు స్తంభాలు సమాజ నిర్మాణానికి బలమని, అశోక ధర్మ చక్రంలోని 24 అరాలు కూడా ముస్లింలు ఆచరించే విలువలను సూచిస్తాయని వివరించారు. గాంధీ సెంటర్‌లో గల గాంధీ విగ్రహం వద్ద అతిథులంతా కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె అబ్దుల్ రజాక్, డాక్టర్ కేవీఎస్ మూర్తి, ప్రొఫెసర్ ఎస్ఎం ఇక్బాల్, సిస్టర్ బి.కె.రమేశ్వరి, ఎంవీ ఖాన్, శివాజి, సురేష్ జోగారావు, హుస్సేన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

» ఎంఎంటీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సమావేశంలో జనరల్ సెక్రటరీ కె.ఎ.నరసింహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎంటీసీ జనరల్ సెక్రటరీ కె.ఎ.నరసింహన్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎంఎంటీసీ (మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిరంతరం కృషి చేస్తుందని ఆలిండియా రిటైర్డ్ ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ కె.ఎ.నరసింహన్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఎంఎంటీసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నరసింహన్, అధ్యక్షుడు ఎస్‌కే వశిష్టులు జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ వంటి ప్రయోజనాలు సమయానికి అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఆరోగ్య బీమా పథకాలు, వైద్య ఖర్చులు సైతం శాతశాతం వచ్చేలా తమ సంఘం కృషిచేసిందన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సైలాడ మురళీకృష్ణమోహన్ మాట్లాడుతూ వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. సంఘం అధ్యక్షుడు ఎ.కైలాసరావు, కోశాధికారి పి.రామకృష్ణారావు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుకకొండపై పౌర్ణమి పూజలు



సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

మహారాణిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భాద్రపద పౌర్ణమి సందర్భంగా ఇసుకకొండపై గల రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రగ్రహణం నేపథ్యంలో భక్తులు తెల్లవారుజాము నుంచే విచ్చేసి సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు, ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ, పద్మజా దంపతులు విచ్చేయడంతో అర్చకులు వారితో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు.

అశోక్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం

» ఆయనను మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలి

» శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుషికొండ భవనాలను మానసిక చికిత్సాలయం (మెంటల్ హాస్పిటల్)గా మార్చాలని గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజు చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని శాసనమండలి విపక్షనేత బొత్ససత్యనారాయణ అన్నారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడడం ఆయన మానసికస్థితిని తెలియజేస్తున్నదన్నారు. రాచరికపు పోకడలు, అహంకారం, రాజకీయ దుర్బుద్ధితో మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజును ముందు మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలని బొత్స డిమాండ్ చేశారు. రుషికొండ భవనాలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పరిశీలించినపుడు సీలింగ్ ఊడిపోయిందని మీడియాకు చూపించారని, అది ఊడిపోయిందో... ఊడగొట్టారో నిర్ధారించుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. ఒకవేళ ఊడిపోతే నాసిరకమైన సామాగ్రిని వాడినట్టే కాబట్టి, కూటమి ప్రభుత్వహయాంలోనే సంబంధిత కాంట్రాక్టర్‌కు చెల్లింపులు జరిపినందున అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. రుషికొండ భవనాలను ఏం చేయాలో తెలియడం లేదని చెబుతున్నారని, సీఎం పర్యటనకు నోవాటెల్, రాడిసన్‌బ్లూ హోటల్‌కు గత ఏడాదికాలంలో ఇచ్చినబిల్లులు చూస్తే ఆయా కార్యక్రమాలకు దీనినే ఎందుకు వాడుకోకూడదనేది తెలుస్తుందన్నారు. అలాచేసినా, లేదంటే ఎవరికైనా వేలం ద్వారా లీజుకు ఇచ్చినా ఏడాదికి రూ.25 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందన్నారు. ఇది ప్రభుత్వానికి తన ఉచిత సలహా మాత్రమేనన్నారు. రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రశ్నిస్తే ప్రభుత్వంలోని పెద్దలు బెదిరిస్తున్నారని బొత్స ఆరోపించారు. బెదిరింపులకు ఎవరూ భయపడిపోరని, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకి అప్పగించాలని చంద్రబాబు నిర్ణయించారని, వీటిని వారి అనుయాయులకు వాటిని కట్టబెట్టేందుకేనని బొత్స అనుమానం వ్యక్తంచేశారు. గత 14 నెలల్లో రూ2 లక్షల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వం.. వైద్య కళాశాలలకు రూ.6 వేల కోట్లు కేటాయించలేదా? అని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై ఈ నెల తొమ్మిదిన రాష్ట్రవ్యాప్తంగా నిరసనకార్యక్రమాన్ని నిర్వహిస్తామని బొత్స పేర్కొన్నారు.

ముగిసిన ర్యాంకింగ్ చెస్ చాంపియన్‌షిప్



విజేతలతో ఏయూ మాజీ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య చెస్ అకాడమీ నిర్వహించిన 8వ ర్యాంకింగ్ చెస్ టోర్నీ ఆదివారం ముగిసింది. నగరంలోని శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆవరణలో జరిగిన ఈ టోర్నీలో వివిధ జిల్లాల నుంచి 230 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ జి.శ్రీనివాసరావు, ఆంధ్ర చెస్ సంఘం ఉపాధ్యక్షుడు ఎంవీరావు, ఆల్ విశాఖ చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి మణికంఠ, ఆదిత్య చెస్ అకాడమీ డైరక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

బాలికల అండర్-6లో రేణుశ్రీ, అండర్-8లో మనస్వి, అండర్-10లో గిరీష్ మా అనంతలక్ష్మి, అండర్-12లో శ్రీలక్ష్మి మన్విత, అండర్-14లో అంజన కోనూరు, అండర్-16లో లక్ష్మీప్రియ బట్ట ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర అండర్-6లో అభినవ్ వైద్యభూషణ, అండర్-8లో శవాంక్ కుంచ, అండర్-10లో సార్వేష్, అండర్-12లో జశ్విన్ వడ్డీ, అండర్-14లో వాకాడ శ్రీరామ్ జైన్, అండర్-16లో వెంకటేశ్వరరావులు ప్రథమ స్థానంలో నిలిచారు.

టీడీపీ వార్డు అధ్యక్షుల నియామకం



బండి రంజిత్ (55వ వార్డు)

కంచరపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా బండి రంజిత్, ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డిలను నియమిస్తున్నట్టు పార్లమెంట్ సభ్యుడు శ్రీభరత్ ప్రకటించారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలో గల అన్ని వార్డులకు నూతన అధ్యక్ష, కార్యదర్శులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జిల సమక్షంలో ఎంపీ భరత్ శనివారం ప్రకటించారు. 47వ వార్డు అధ్యక్షుడిగా చెంగల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సత్యనారాయణ రాజును నియమించారు. నూతనంగా ఎన్నికైన వారిని నాయకులు,కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీని బలోపేతం చేస్తామని నూతన అధ్యక్షులు పేర్కొన్నారు.

50వవార్డుకు వరప్రసాద్



మురళీనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 50వ వార్డు టీడీపీ అధ్యక్షునిగా ఎస్.వరప్రసాద్‌ను నియమించారు. ఆయనకు ఎంపీ, గండి బాబ్జి కలిసి నియామక పత్రం అందించారు. వార్డు కార్యాలయంలో అభిమానులు వరప్రసాద్‌ను అభినందించారు. తనకు మరోసారి అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్టానానికి వరప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా స్విమ్మింగ్ సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి, పర్యవేక్షకులు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. బీచ్‌రోడ్డు ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరిగిన ఎన్నికలలో అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్ శెట్టి, కార్యదర్శిగా జి.శ్రీరామమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.మోహన వెంకటరామ్, కోశాధికారిగా ఎన్.రఘునాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.రామారావు, డి.లక్ష్మీసింధు, విజయ్‌కుమార్ నటరాజన్, కె.రవికుమార్, పరవాడ ఈశ్వరరావులు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఎస్.శ్రీధర్, బీవీఎస్ఎస్.ఎ.రాజి, జాన్ జీవన్‌కుమార్ రంధి (రైల్వేస్), ఈగల హేమంత్‌కుమార్ (రైల్వేస్), పి.రమేష్‌లు ఎన్నికయ్యారు. మరో ఏడుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారని నూతన కార్యదర్శి జి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర స్విమ్మింగ్ సంఘం కోశాధికారి ఐ.రమేష్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నుంచి పి.శైలజ, ఒలింపిక్ సంఘం నుంచి ఐ.వెంకటేశ్వరరావు పర్యవేక్షకులుగా, ప్రముఖ న్యాయవాది పల్లా బాలాజి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

ఉచిత దంతవైద్య శిబిరానికి స్పందన



దంత చికిత్స చేస్తున్న డాక్టర్ అనుషా పట్నాయక్, చిత్రంలో కార్పొరేటర్ కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు ఉచితంగా దంతవైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని జీవీఎంసీ 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. అల్లిపురంలోని శిష్టకరణాల సంఘం కార్యాలయంలో ఫోర్ డిస్ డెంటల్ హాస్పటల్ సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. దంత సంరక్షణపై అవగాహన కల్పించి, ఉచితంగా పేస్టులు, నోటి శుభ్రత (మౌత్ వాష్) మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎన్.కె మహంతి, ఆసుపత్రి అధినేత డాక్టర్ సుధాకర్ పట్నాయక్, డాక్టర్ అజిత్, అనుషా పట్నాయక్, కార్యదర్శి డి.హరనాథ్, మంత్రి శాలివాహన్, పక్కి బాలాజీ విఠల్, పక్కి నరసింహారావు, కుప్పిలి ఆనందరావు పాల్గొన్నారు.


మద్యం మత్తులో ట్రాఫిక్ పోలీసులపై దాడి...!

కంచరపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి మెట్టు వద్ద ఆదివారం రాత్రి డ్రంక్&డ్రైవ్ కేసులు రాస్తుండగా మద్యం మత్తులో ఉన్న వ్యక్తి ట్రాఫిక్ పోలీసులపై దాడికి పాల్పడినట్టు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం మెట్టు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్‌పై కోడి మహేష్ అనే వ్యక్తి దాడికి పాల్పడడంతో ఎస్ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనం నడిపి దొరికిపోవడంతో పోలీసులు బ్రీతింగ్ ఎనలైజర్ ఊదాలని చెప్పారు. ఇందుకు ఆగ్రహించిన మహేష్ కేసు రాసుకోండి అంటూ దాడికి దిగాడు.

పేకాడుతున్న 9మంది అరెస్టు

కంచరపాలెం స్టేషన్ పరిధి పట్టాభిరెడ్డితోట భాస్కర్ గార్డెన్స్‌లోని ఓ ఇంటిలో పేకాడుతున్నట్టు సమాచారం రావడంతో ఆదివారం పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.37 వేల నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు కంచరపాలెం సీఐ కె.రవికుమార్ తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్టు సీఐ పేర్కొన్నారు.

అగ్నిమాపక శాఖ అధికారులతో డీజీ సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీజీ వెంకటరమణ

విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో అగ్ని మాపక శాఖ పనితీరుపై ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ పి.వెంకటరమణ ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఐఐఎం క్యాంపస్‌లో జరిగిన ఈ సమావేశంలో తొలుత ఆయన ఆయా జిల్లాల్లోని శాఖల పనితీరు, భవనాల పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఓసీల జారీని రాష్ట్ర ప్రభుత్వం వికేంద్రీకరించడంతో ప్రజలు సులభంగా ఎన్ఓసీలు పొందగలుగుతున్నారని చెప్పారు. రాష్ట్ర మున్సిపల్ శాఖతో కలిసి సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులు ఇవ్వడం వల్ల ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందన్నారు. వాట్సాప్ ద్వారా సేవలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. స్టేషన్లలో పరిశుభ్రత పెంపొందించేందుకు ఈనెలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ప్రతి బుధవారం సిబ్బంది సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరిస్తామని, దీనిపై సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. కాగా హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్‌బీసీ ప్రకారం అగ్నిమాపక భద్రతా చర్యలు లేని భవనాలకు నోటీసులు జారీ చేస్తున్నామని కొందరు అధికారులు డీజీకి వివరించారు. ఈ సమావేశంలో జోన్-1 ప్రాంతీయ అగ్నిమాపక అధికారి డి. నిరంజన్ రెడ్డి, ఆరు జిల్లాల శాఖాధికారులు, పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా

... 5వ పేజీ తరువాయి

ఉందంటున్నారు. కళాశాల చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల చుట్టూ కంచె ఏర్పాటుచేసి హెచ్చరిక బోర్డులు పెట్టాల్సి ఉంది.

నిర్మాణాలు ఆపించాం

విశాఖ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని సర్వే నంబరు 58లో ప్రభుత్వ భూమి ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించాం. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. వారు ఆదేశాలు జారీచేసిన వెంటనే తొలగింపు చర్యలు చేపడతాం. - **జి.విజయం, వీఆర్వో, నరవ**

ప్రాణం తీసిన వేట సరదా

... 5వ పేజీ తరువాయి

బాల్యమిత్రులు. చిన్నపాటి పనులు చేస్తూనే చదువుకుంటున్నారు. వచ్చిన డబ్బుతో కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నారు. ఎక్కడికైనా కలిసే వెళ్తారు. చివరకు మృత్యువులోనూ వారి బంధం వీడలేదు. బల్లంకి శేఖర్. యాదాడ లక్ష్మణ్‌కుమార్ మృతితో పెందుర్తిలో విషాదం అలముకుంది, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. శేఖర్ చిన్నప్పుడే తండ్రి బంగార్రాజు మరణించడంతో తల్లి మహాలక్ష్మి కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. అన్నయ్య వాసు, మిత్రుడు లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి శేఖర్ డాక్‌యార్డులో పనికి వెళ్లేవాడు. లక్ష్మణ్‌కుమార్ తండ్రి సూరిబాబు ఎలక్ట్రీషియన్, తల్లి లక్ష్మి టైలర్. అన్నయ్య మన్మథరావు బిగ్‌బాస్కెట్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన అన్నయ్య వాసు, మిత్రుడు లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి చేపలు పట్టేందుకు మేహాద్రి రిజర్వాయర్‌కు వెళ్లారు. ఈ క్రమంలో కాలుజారి లక్ష్మణ్‌కుమార్ నీటిలో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు దూకిన శేఖర్ విఫలమై, అతడు కూడా మునిగిపోయాడు. దీంతో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

నాన్‌స్టాప్ కౌంటర్లు ఖాళీ

... 5వ పేజీ తరువాయి

సర్వీసులున్నాయి. వీటితో పాటు ఆర్డినరీ, పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసులు నడుస్తున్నాయి. వీటిలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంది. ఒకే కుటుంబానికి చెందిన పురుషులు ఒక బస్సులో, మహిళలు మరో బస్సులో ప్రయాణించేందుకు ఇష్టపడకపోవడంతో అందరూ ఈ ఐదు రకాల బస్సులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద జనం కనిపించడం లేదు. సాధారణంగా శ్రీకాకుళానికి ప్రతి 30 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ సర్వీస్ నడుస్తుంది. నర్సీపట్నానికి 50 నిమిషాల వ్యవధిలో, కాకినాడ, రాజమండ్రి గంట వ్యవధితో షెడ్యూల్ సర్వీసులు ఉన్నాయి. అయితే బస్సులు బయలుదేరే సమయానికి వీటిలో 30 శాతానికి మించి ఆక్యుపెన్సీ రావడంలేదు. దీంతో కొన్నింటిని రద్దు చేసి బస్సుల మధ్య వ్యవధి పెంచారు. శ్రీకాకుళం నాన్‌స్టాప్‌లను 30 నిమిషాల నుంచి 45 నిమషాలకు, నర్సీపట్నానికి 50 నిమిషాల నుంచి 1.10గంటలకు, రాజమండ్రి, కాకినాడలకు గంట నుంచి గంటన్నర వ్యవధితో బస్సులు నడుపుతున్నారు. అయినా ఆక్యుపెన్సీ రేషియో 40 శాతానికి మించి రావడంలేదని అధికారులు వాపోతున్నారు. స్త్రీశక్తి పథకం అమలు ప్రభావం నాన్‌స్టాప్ సర్వీసులపై పడిందని చెబుతున్నారు.

ఉలిక్కిపడిన నగరం

... 5వ పేజీ తరువాయి

ట్యాంకులోపల, చుట్టూ మంటలు అంటుకున్నాయి. ట్యాంకు చుట్టూ మంటలను సుమారు ఎనిమిది గంటలు శ్రమించి ఆర్పేశారు. ట్యాంకు లోపల మంటలు అదుపుచేయడం అంత సులువుకాదు. మిథనాల్‌ను ట్యాంకు అడుగు భాగం నుంచి పైపు ద్వారా మరో ట్యాంకుకు తోడుతున్నారు. అదే సమయంలో ట్యాంకుపైన అంటుకున్న మంటలను అదుపు చేస్తున్నారు. సోమవారం ఉదయానికి మంటలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. కాగా మిథనాల్‌కు మండే స్వభావం ఉన్నా మంటల వల్ల కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, ఆక్సిజన్(నీటి ఆవిరి)గా మారుతున్నందున కొంత వరకు ప్రమాదం తగ్గుతుందని నిపుణులు వ్యాఖ్యానించారు. ఈస్టిండియా కంపెనీలో ప్రమాదం సంభవించిన వెంటనే ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు, పోలీసులు, కాలుష్య నియంత్రణమండలి అధికారులు సందర్శించారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఇన్‌చార్జి ఫైర్‌డీజీ వెంకటరమణ సందర్శించి పరిస్థితి సమీక్షించారు. స్టోరేజీకి ఎప్పటికప్పుడు అనుమతులు ఇస్తుంటామని కాలుష్య నియంత్రణమండలి ఈఈ ముకుందరావు తెలిపారు.

నగరంలో పిడుగులు సాధారణమే..

జనావాసాలకు దూరంగా పిడుగులు పడుతుంటాయి. అయితే ఒక్కోసారి తీవ్రమైన పిడుగులు నగరంలో ఖాళీ ప్రదేశాలు, ఎత్తైన చెట్లు/ టవర్లపై పడుతుంటాయి. పారిశ్రామిక కార్యకలాపాలు జరిగే ప్రాంతంలో ఆదివారం పిడుగు పడడం సాధారణమేనని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు. మిచాంగ్ తుఫాన్ సమయంలో చినవాల్తేరులోని తుఫాన్ హెచ్చరిక కేంద్రం సమీపంలో ఎత్తైన తాటిచెట్లపై పిడుగు పడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఏయూ ఉన్నత పాఠశాల సమీపంలో పిడుగు పడడంతో రెండు చెట్లు కాలిపోవడం చాలామంది చూసే ఉంటారన్నారు. పిడుగుల తీవ్రత ఏటా పెరుగుతుందని, ప్రజలు నిరంతరం విద్యుత్ వాడుతుంటారని, పిడుగులు పడే వాతావరణం ఉన్నప్పుడు టీవీలు, సెల్‌ఫోన్లు ఆఫ్ చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, వాటిని వాడితే పిడుగు తీవ్రత పెరుగుతుందన్నారు.

జీవీఎంసీలో అవినీతి రాకెట్!

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదులు గుప్పించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియోజకవర్గం పరిధిలో ప్రజారోగ్య విభాగంలో కొందరు పనిచేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని, దీనిపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదుచేశారు. దీనిపై జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు వివరణ ఇస్తూ అలాంటిదేమీ లేదని, అందరూ కచ్చితంగా పనిచేస్తేనే జీతాలు అందుతాయని చెప్పడంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గంట సమయం ఇస్తానని, ఎమ్మెల్యే చెప్పిన పది మంది కార్మికులు ఎక్కడెక్కడ విధులు నిర్వర్తించారనే దానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉంటే తీసుకురావాలని ఆదేశించారు. కానీ జోనల్ కమిషనర్ వాటిని తీసుకురాలేకపోవడంతో జీవీఎంసీ పనితీరుపై తీవ్రస్థాయిలో ఇన్‌చార్జి మంత్రి ఆరోపణలు గుప్పించారు.

జీవీఎంసీలో కొంతమంది సర్వేయర్లు ప్రైవేటు వ్యక్తులకు అనుకూల నివేదికలిస్తున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యేలు పలుమార్లు ప్రస్తావించారని, చీఫ్ సిటీ ప్లానర్ సమావేశానికి రాకపోవడంతో చాలామంది ఎమ్మెల్యేలు తమ ఫిర్యాదులను బయటపెట్టలేకపోయారన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి జరుగుతున్న సమాచారం తన వద్ద ఉందన్నారు. పెద్దఎత్తున నిధులను కొల్లగొట్టే రాకెట్ నడుస్తోందని, త్వరలోనే దీనిని బయటకు తీస్తానని హెచ్చరించినట్టు కొందరు ఎమ్మెల్యేలు చెప్పడం చర్చనీయాంశంగా మారింది. జీవీఎంసీలో కొంతకాలంగా రాత్రిఫుడ్‌కోర్టుపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. కౌన్సిల్ మీటింగ్ జరిగిన ప్రతి సారీ ఫుడ్‌కోర్టును తొలగించాలని సభ్యుడు డిమాండ్ చేయడం, తక్షణం తొలగించాలని మేయర్ ఆదేశాలు ఇలివ్వడం పరిపాటిగా మారింది. దీనివెనుక కొందరు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కోడివ్యర్థాలను చేపల చెరువులకు తరలింపు అంశంపై కార్పొరేటర్లు, ఎమ్మెల్యేల మధ్య పెద్దయుద్ధమే జరుగుతోంది. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో సర్వేయర్లు ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా నివేదికలను ఇచ్చి పార్కులు, గెడ్డలను అన్యాక్రాంతం చేస్తున్నారని చెబుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో కొందరు అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వారికి అనుకూలంగా అంచనాలు తయారుచేయడం, టెండర్లను అస్మదీయులకు వచ్చేలా సహకరించి, భారీగా జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. యూసీడీ విభాగంలో మహిళా సంఘాల ఆడిట్ పేరుతో సిబ్బంది పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులున్నాయి. వీటన్నింటిపైనా ఇన్‌చార్జి మంత్రికి పూర్తి సమాచారం అందడంతోనే జీవీఎంసీలో అవినీతి రాకెట్ నడుస్తోందని వ్యాఖ్యానించి ఉంటారనే అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యాఖలు జీవీఎంసీలోని కొందరు అధికారుల్లో గుబులురేపుతున్నాయి. ఏక్షణంలో సమీక్ష పేరుతో జీవీఎంసీకి వచ్చి తమ అవినీతి, అక్రమాలను నేరుగా బయటపెడతారోనని ఆందోళన చెందుతున్నారు.

స్వామి సన్నిధిలో 'కల్యాణం' కలేనా?

- పెదవాల్తేరులోని వెంకటేశ్వరుడి ఆలయంలో శిథిలావస్థలో కల్యాణ మండపం
- నిధులు మంజూరైనా జరగని పునర్నిర్మాణం
- వివాహాలు జరుపుకోవడానికి కూడా అవకాశం లేకపోతోందంటూ భక్తుల ఆవేదన


శిథిలావస్థలకు చేరిన వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణమండపం


పెచ్చులూడుతున్న పై కప్పు


కూలడానికి సిద్ధంగా ఉన్న మెట్లు

పెదవాల్తేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న దేవాలయాల్లో ఒకటి పెదవాల్తేరులోని వేంకటేశ్వరస్వామి దేవాలయం. గతంలో నిధులు విడుదలైనా పనులు జరగకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు. దీనిపై పలు విమర్శలు ఉన్నాయి. దేవుడి సన్నిధిలో వివాహాలు చేద్దామన్నా.. అవకాశం లేకుండా పోవడంపై భక్తులు అంసతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తూర్పు నియోజకవర్గంలోని పెదవాల్తేరు, చినవాల్తేరు, పాండురంగపురం తదితర ప్రాంతాల్లో ఈ దేవస్థానానికి చెందిన ఐదు ఉప ఆలయాలు ఉన్నాయి. ఇందులో నాలుగు దేవస్థానాల్లో కల్యాణమండపాలు ఉన్నాయి. గతంలో రెండు కల్యాణ మండపాల నిర్మాణలను పనులు చేపట్టారు. ఒకటి పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ దేవస్థానం కల్యాణ మండపంపై రెండో అంతస్తు నిర్మాణలను పనులు చేపట్టి పూర్తి చేశారు. రెండోది చినవాల్తేరులోని కనకమహాలక్ష్మి (దుర్గా) అమ్మవారి దేవస్థానంలో కల్యాణమండపం పనులు పూర్తి చేశారు. కానీ పెదవాల్తేర్ లాసన్స్ బే కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం అవరణలో కల్యాణమండపం శిథిలావస్థకు చేరుకొంది. కల్యాణ మండపం పనులు ఎప్పుడు తలపెట్టతారో గాని ఇప్పటికీ ఒక కలిక్కి రాకపోవడం గమణార్హం. ఏళ్ల తరబడి పనులు జరగకపోవడంతో తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. విడుదలైనా పనులు ఎందుకు చేయడం లేదో ఎవరికీ అంతు బట్టడం లేదని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవుని సన్నిధిలో వివాహాలు చేసుకుందామన్నా అవకాశం లేకుండాపోతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వేంకటేశ్వర స్వామి దేవస్థానం అవరణలో కల్యాణ మండపం శిథిలావస్థకు చేరుకొంది. ఎక్కడ ఎడితే అక్కడ పెచ్చులు ఊడుడిపోతున్నాయని భక్తులు అంటున్నారు. కొన్నిసార్లు దర్శనాలకు వచ్చిన భక్తులపై కూడా పెచ్చులు పడిన ఉదంతాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటకైనా దేవదాయ శాఖ అధికారులు, కల్యాణ మండపం పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కల్యాణ మండపంతో పాటు ఈవో కార్యాలయం, అర్చకులు నివాసాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు పడిపోయోనన్న దుస్థితికి చేరడంతో అంతా ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకునే నాథుడే లేడాయె..

పెదవాల్తేరులోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి ఏళ్ల చరిత్ర ఉంది. ఈ దేవస్థానం అవరణలోని పాత కల్యాణమండపం స్థానంలో కొత్త కల్యాణ మండపం నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. కొత్త కల్యాణ మండపం నిర్మాణానికి గతంలో శంకుస్థాపన కూడా చేశారు. ముందుగా కల్యాణమండపం పై అంతస్తు నిర్మించాలని తలపెట్టారు. కానీ గతంలో దేవస్థానం అధికారులు ఏయూ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆధికారులతో సర్వే చేయించారు. అయితే పాత కల్యాణమండపం భవనం పూర్తిగా తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. దీంతో గతంలో ప్లాను మార్చాల్సి వచ్చింది. అందుకే నిర్మాణంలో జాప్యం జరుగుతోందని దేవస్థానం వర్గాలు చెబుతున్నాయి. ఇదేదో ముందుగానే చూసుకుంటే సరిపోయేది కదా అని స్థానికులు, భక్తులు అంటున్నారు. ఇప్పటికే పాత కల్యాణమండపం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడ శుభకార్యాలు చేసుకోవడానికి భక్తులు భయపడిపోతున్నారు. ఈ కల్యాణమండపం పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో ఎవరికీ తెలియని అయోమయం నెలకొంది. వర్షాలకు కల్యాణ మండపం పూర్తిగా తడిసిపోయింది. ఎప్పుడు ఈ కల్యాణమండపం కూలిపోతుందోనని స్థానికులు, భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

చంద్రగ్రహణం ఎఫెక్ట్..
పలు ఆలయాల మూసివేత


మూసివేసిన సంపత్ వినాయగర్ ఆలయం

సిరిపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా సంపత్ ఆదివారం నగరంలోని పలు ఆలయాలను తాత్కాలికంగా మూసి వేశారు. ఆశీల్‌మెట్ట లోని వినాయగర్ ఆలయం మూతవేశారు. దేవాలయంలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సంప్రదాయద్ధంగా అర్చనలు, పంచామృతాభిషేకాలు పూర్తి చేసి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు మంగళహారతులు సమర్పణగావించి దేవాలయాన్ని మూసివేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలన్నీ పూర్తి చేసి తలుపులు మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు యథావిధిగా గణపతి హారతి, మహా సంప్రోక్షణం జరిపించి, ఉదయం 7 గంటల నుంచి భక్తులకు దర్శనాలకు అవకాశం కల్పిస్తామని ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు.

కరకచెట్టు పోలమాంబ ఆలయం..

పెదవాల్తేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవాలయం, లాసన్స్ బే కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, చినవాల్తేరులోని శ్రీకనక మహాలక్ష్మి (దుర్గా) అమ్మవారి దేవాలయం, చినవాల్తేరులోని జగన్నాథ స్వామి దేవాలయాల్లో ఆదివారం తెల్లవారు జామున సంప్రదాయ కార్యక్రమాలు పూర్తి చేసి భక్తులకు ఉదయం నుంచి పదకొండున్నర వరకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం దర్శనాలు నిలిపివేశారు. ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి సోమవారం ఉదయం 9:00 గంటల వరకూ ఆలయం మూసివేస్తున్నట్టు శ్రీపోలమాంబ అమ్మవారి దేవాలయం ఈవో కె.గాయత్రి తెలిపారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం దేవాలయం ఉదయం 9:00 గంటల తర్వాత భక్తులకు దర్శనం కల్పించనున్నట్టు ఆమె తెలిపారు.



మూసివేసిన కరకచెట్టు పోలమాంబ ఆలయం

కేన్సర్ రోగులకు మెరుగైన చికిత్సే లక్ష్యం

- మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ


వేడుకలను ప్రారంభిస్తున్న ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి. మురళీకృష్ణ

విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్న లక్ష్యంతో 20 ఏళ్ల కిందట ఆస్పత్రి ఏర్పాటు చేశామని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ అన్నారు. ఆస్పత్రి ఏర్పాటు చేసి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పీఎంపాలెంలోని వి. కన్వెన్ హాల్‌లో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రి ప్రయాణంలో ఇదో మైలురాయిగా అభివర్ణించారు. ఇన్నేళ్ల ప్రస్థానంలో కొన్నిలక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నా మని చెప్పారు. శ్రేయా కేన్సర్ ఫౌండేషన్ వంటి ఎన్‌జీవోల సహకారంతో ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. 2005లో ఆరు పడలకతో ఏర్పాటైన ఆస్పత్రి ప్రస్తుతం దేశంలోని ప్రముఖ కేన్సర్ ఆస్పత్రుల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీజీ సీవోవో డాక్టర్ మనీశ్ మోట్వో తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎన్టీపీఏ ముందంజ

- ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

పెందుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీపీఏ) ముందంజలో ఉందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. ఎన్‌టీపీఏ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి సమావేశాన్ని ఆదివారం పెందుర్తిలో గల టీటీడీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను చేపట్టిన ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను చేపడుతుందన్నారు. విద్య ప్రాధాన్యం, విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులను మంత్రి నారా లోకేశ్ కేటాయించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, రాష్ట్రంలో 85 శాతం మంది ఉపాధ్యాయులు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు హయాంలోనే డీఎస్సీల ద్వారా కొలువులు సాధించారన్నారు. ఎన్టీపీఏ జిల్లా అధ్యక్షుడు టీవీ రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బొనిగెల హైమారావు, నాయకులు జె.శ్రీనివాసరావు, శ్రీదేవి, పెనుమత్స కృష్ణంరాజు, నక్కా శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి హయాంలో రజకులు అన్ని రంగాల్లో అభివృద్ధి

- 'రజకుల ఆకాంక్ష సభ-2'లో రాష్ట్ర మంత్రులు పార్థసారధి, సత్యకుమార్, కొల్లు రవీంద్ర



వేదికపై మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు పంచకర్ల, ఎన్.ఈశ్వరరావు (ఎచ్చెర్ల), పి.విష్ణుకుమార్‌రాజు,వంశీకృష్ణశ్రీనివాస్, ఎమ్మెల్సీచిరంజీవిరావుతదితరులు

సిరిపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో రజకులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి సాధించేందుకు పూర్తి అవకాశాలు కలిగిస్తున్నామని రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షతన 'రజకుల ఆకాంక్ష సభ-2 ప్రభుత్వ పథకాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు తొలుత సంత్‌గాడ్జే, మావిడాల మాచయ్య, వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రజకులకు ఐక్యత అవసరమన్నారు. ప్రభుత్వం వారి కోసం తీసుకొచ్చే జీవోలను అడిగి మరీ అమలు చేయించుకోవాలని సూచించారు. రజకుల జీవన పరిస్థితులు ఇంకా వెనుకబాటుగా ఉండటం బాధకరమన్నారు. కుల వృత్తులను రిజర్వ్ చేయడంతో పాటు, హోటల్స్ టూరిస్ట్ రిసార్టులలో దోబీ పనిని హక్కుగా కల్పించేలా ప్రత్యేక చట్టం రావాల్సి ఉందన్నారు. రజకులను ఎస్సీల్లో చేర్చే తీర్మానాన్ని టీడీపీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రజక సామాజిక వర్గానికి ఒక ప్రత్యేకస్థానం ఉందన్నారు. నిజం చెప్పాలంటే నేను కూడా నన్ను రజక వర్గానికి చెందినవాడిగానే భావిస్తానన్నారు.తమ ఇంట్లో ఓ సోదరి నాకు ఇస్త్రీ చేయడం నేర్పించిందన్నారు. కొన్నేళ్లపాటు నేనే ఇస్త్రీ చేసుకున్నానన్నారు. బలహీనవర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలను ముందుకు తెచ్చిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దోబీల నియామకానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు రూపొందించిన చట్టాల ద్వారా హక్కులను సాధించుకోవాలని సూచించారు. గతంలో బలహీనవర్గాల నేతలపై దాడులు జరిగాయని అన్నారు.త్వరలోనే బీసీ రక్షణ చట్టం రానుందని హామీ ఇచ్చారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. నైపుణ్య శిక్షణలు అందించి స్వయం ఉపాధి దిశగా సహకారం అందిస్తామన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ చదువు వల్లే దారిద్ర్యానికి విముక్తి లభిస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టా సారించాలని సూచించారు. కులవృత్తులను గౌరవిస్తూనే ఆధునికతో కలిపి ముందుకు తీసుకెళ్లానన్నారు. రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ హక్కుల సాధనలో అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ హక్కుల సాధనకు రాజకీయమేమార్గమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రజకుల సంక్షేమం కోసం టీడీపీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రజకులకు ఎస్సీ హోదాపై చర్చ జరుగుతుందన్నారు. ఈ ఆంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ల కమిటీ అధ్యయనం చేసినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణశ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, బీజేపీ నేత పి.పరశురామ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వలలకు పుష్కలంగా చిక్కిన మత్స్యసంపద


కిటకిటలాడుతున్న చేపల రేవు

బీచ్‌రోడ్డు, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో మత్యకారుల వలలకు ఆదివారం పుష్కలంగా వివిధ రకాల చేపలు లభ్యమయ్యాయి. రొయ్యలు, పీతలు కానగడితలు, పారలు తదితర పలు రకాల చేపలు అధిక సంఖ్యలో చిక్కాయి. వేల రూపాయలు విలువ చేసే ఈ మత్స్య రాశులను విక్రయించేందుకు ఫిషింగ్ హార్బర్‌కు తరలించారు. ఆర్థికంగా ప్రయోజనం చేకూరడంతో జాలర్లు ఆనందం వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 28, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 24, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 46, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 70, బరబాటి 42, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276

విశాఖలో జైపూర్ రగ్స్ ఉత్సవం

- యోగేష్ చౌదరి

రామ్‌నగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో త్వరలో జైపూర్ రగ్స్ ఉత్సవం నిర్వహించనున్నట్టు జైపూర్ రగ్స్ సంస్థ డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. ఆదివారం గ్రీన్‌పార్కు రోడ్డులోని ఒక హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడుతూ త్వరలో రానున్న శీతాకాలం, నేపథ్యంలో ప్రజలకు రగ్స్ అవసరమవు తాయని, వారికి అవసరమైన గ్రామీణ కళాకారుల ఊహాశక్తి నుంచి ఉతక్తొత్తి చేసిన సంప్రదాయ, ఆధునిక డిజైన్లతో కూడిన 14 వేల రకాలకు పైగా రగ్స్ ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. వందేళ్లకు పైబడిన వింటేజ్ యాంటిక్ రగ్స్ ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నేటి వ్యాపార ఎగుమతి, దిగుమతి పరిస్థితులు మారుతున్న నేపథంలో ఉత్సవం ప్రత్యేక సేవా కార్యక్రమానికి అనుసంధానమై ఉంటుందని తెలిపారు. త్వరలోనే తేదీలు, వేదిక వివరాలు తెలియజేస్తామని ఆయన వెల్లడించారు.

9న అదనపు గదుల స్కూలు భవనం ప్రారంభోత్సవం

- ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న మంత్రి సంధ్యారాణి

ఆరిలోవ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దీనదయాళ్‌పురంలో గల ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంపై నిర్మించిన అదనపు గదుల భవనానికి ఈ నెల 9న ప్రారంభోత్సవం చేపడుతున్నట్టు బాలుర ప్రత్యేక పరిశీలన గృహం పర్యవేక్షణాధికారి అన్నాజీరావు తెలిపారు. ఆయన శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏపీ మహిళా, శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నాజీరావు కోరారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

- 11న గాజువాకలో సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో బహిరంగసభ



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

ఆరిలోవ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీలుప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో ఆదివారం 13వ వార్డులో గల కనకమహాలక్ష్మి నగర్, జైభీమ్ నగర్, రామకృష్ణాపురం ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ ఈ డిమాండ్‌తో గాజువాకలో సెప్టెంబరు 11న గాజువాకలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించవద్దన్నారు. స్టీలు ప్లాంటును 46 ముక్కలుగా విడగొట్టి ఈవోఐ పేరుతో దొడ్డి దారిన ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దీనికి కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని పేర్కొన్నారు. ఈవోఐ పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పని చేసే పాతమీటర్లు ఉండగా, అదాని స్మార్ట్‌మీటర్లు కొత్తగా ప్రతి ఇంటికి బిగించడం అన్యాయం అన్నారు. ఈ పాదయాత్రలో నేతలు ఐసీ నాయుడు బి.రత్నం, ఇ.ఆదినారాయణ, మంగటిరాజు, పి.శంకరరావు, రాగోలు గణపతి, జి. లక్ష్మినారాయణ, సీహెచ్ రాము, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూలో జంతువుల సంతానోత్పత్తి

- బ్లూ గోల్డ్ మకావ్ పక్షికి రెండు పిల్లలు
- ఐదు పిల్లలకు జన్మనిచ్చిన బ్లాక్‌బక్, చౌసింగా అనే జింక జాతి జంతువులు


జన్మనిచ్చిన ఆడ, మగ పిల్లలతో చౌసింగా


ఇంక్యుబేటర్‌లో గుడ్లను పొదిగించడం ద్వారా పుట్టిన బ్లూగోల్డ్ మకావ్ పక్షి పిల్ల

ఆరిలోవ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో బ్లూ గోల్డ్ మకావ్ అనే ఆస్ట్రేలియా జాతికి చెందిన పక్షికి చెందిన రెండు గుడ్ల నుంచి పిల్లలను జైలు అధికారులు కృత్రిమ ఇంక్యుబేటర్‌లలో పొదిగించారు. ఈ ప్రక్రియ విజయవంతమై రెండు రెండు పిల్లలు పుట్టాయి. వీటిని ప్రస్తుతం జూలోని పశువైద్య బృందం హ్యాండ్ రియరింగ్ ద్వారా సంరక్షిస్తున్నారు. ఈ పక్షి పిల్లలు పుట్టడం అనేది జంతు ప్రదర్శనశాలకు సంబంధించి ఒక గొప్ప ముందగుడు అని జూ క్యూరేటర్ జి.మంగమ్మ పేర్కొన్నారు.

అలాగే జింకల జాతికి చెందిన బ్లాక్‌బక్ మూడు పిల్లల్ని, చౌసింగా రెండు పిల్లలకు జన్మనిచ్చినట్టు మంగమ్మ తెలిపారు. వీటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకొంటున్నట్టు ఆమె తెలిపారు.

విశాఖ వైద్యుడికి సర్జన్స్ ఆఫ్ ఇండియా పురస్కారం



డాక్టర్ నారాయణరావుకు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

ఆరిలోవ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ జనరల్ సర్జన్, నారాయణ మెడిసిటీ ఎండీ డాక్టర్ టి.నారాయణరావుకి ప్రతిష్ఠాత్మకమైన అసోషియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా పురస్కారం లభించింది. గుంటూరులోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో మూడు రోజుల పాటు జరిగిన ఆల్ ఇండియా సర్జన్స్‌లో పాల్గొన్న డాక్టర్ టి.నారాయణరావు 'డాక్టర్ కొంపెల్ల సూర్యనారాయణ మూర్తి ఉపన్యాసం'పై ప్రసంగించారు. దేశంలో ఊబకాయం పెనుముప్పుగా తయారైందని ఆందోళనవ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ ఫాస్ట్‌ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారం, అధిక స్థాయిలో చక్కెర, కార్బొహైడ్రేట్స్ కలిగిన ఆహారం తీసుకోవడం సాధారణంగా మారిందన్నారు. ప్రతీ ముగ్గురిలో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నారని వివరించారు. ప్రధానంగా మహిళలు, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారు ఊబకాయం బారినపడుతున్నారన్నారు. దీనివల్ల 40 శాతం మందికి మధుమేహం, 50 నుంచి 70 శాతం మందికి కాలేయ సంబంధిత సమస్యలు, గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉంటోందన్నారు. తగిన వ్యాయామం, ఆరోగ్యకర ఆహారపు అలవాట్లతో ఊబకాయాన్ని దరిచేరకుండా చూసుకోవచ్చని వివరించారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఇండియా ఏపీ చాప్టర్ ప్రతినిధులు డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఫణిమహేష్ రెడ్డి తదితరులు డాక్టర్ నారాయణరావుకి పురస్కారంతో పాటు జ్ఞాపికను అందజేశారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం మూసివేత

మహారాణిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం శ్రీచక్ర నవావర్ణార్చన లక్ష్మీ హోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా వేదపండితులు, అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పంచామృతాభిషేకం, మహానివేదన సమర్పించారు. చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ, పంచామృతాభిషేకం, బాలభోగ నివేదన అనంతరం భక్తుల దర్శనానికి అవకాశం కల్పిస్తారు.

ఐటీఐ అభ్యర్థులకు అప్రెంటిస్ మేళా నేడు

కంచరపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు సోమవారం ప్రధాని నేషనల్ అప్రెంటిస్ మేళాను నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేళాలో ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్థాన్ షిప్‌యార్డు, ఆల్ ఇండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభారతి ఆటో మొబైల్స్ తదితర ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొని యువతకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తారు. ఐటీఐ కోర్సులు పూర్తిచేసి అప్రెంటిస్ పూర్తిచేయని అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చునన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. అర్హత గల ఐటీఐ అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు అన్నీ ధ్రువపత్రాలతో కంచరపాలెం పాత ఐటీఐ వద్దకు హాజరుకావాలని శ్రీకాంత్ సూచించారు.

బాడీ బిల్డర్‌కు ఆర్థిక సాయం



డబ్బులు అందజేస్తున్న సంఘ సభ్యులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బాడీ బిల్డర్ రాంబాబుకు విశాఖ జిమ్ ఓనర్స్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు కిలాని గణేష్, ప్రధాన కార్యదర్శి బి.కోటిరెడ్డి, సభ్యులతో కలిసి ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. ఇళ్లకు వెళ్లి వ్యక్తిగత శిక్షకునిగా ఎంతోమంది శరీరాకృతులను మార్చి వారిని ఆరోగ్యవంతులుగా తయారు చేసిన రాంబాబు స్నానాల గదిలో పడిపోయి తలకు దెబ్బ తగలడంతో పక్షవాతం బారిన పడ్డాడన్నారు. తన భార్య, కుమార్తెతో అక్కయ్యపాలెంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఆశ్రయం పొందుతున్నాడని చెప్పారు. రాంబాబు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మాధవధార, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాధవధార హైస్కూలు వద్ద రామాలయంలో కొలువైన లలితాదేవి మందిరంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి తెలిపారు. ఉత్సవ వివరాలు తెలిపే పోస్టరును ఆవిష్కరించి పూజా కార్యక్రమాల వివరాలు ప్రకటించారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 10 రోజులు అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలియజేశారు. మహిళలకు సామూహిక కుంకుమ పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కొత్త ఆలయ ప్రాంగణంలో అన్ని వసతులు సమకూర్చనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వరప్రసాద్, అర్చకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం, క్రీడాధికారులు, క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే ఆదివారం ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ నిర్వహించింది. స్పోర్ట్స్ ఆఫీసర్ హరినాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష చేపట్టిన ఈ కార్యక్రమంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా పాల్గొని రైల్వే క్రీడాకారులు, ఉద్యోగులను ఉత్సాహపరిచారు. డీఆర్ఎం బంగ్లా నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ 'శారీరక పటుత్వ సాధనకు రోజూ అరగంట కేటాయించండి' నినాదంతో ప్రతి ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రచారంలో భాగంగా వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. డీఆర్ఎం బంగ్లాలో ఈకార్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా, ఇతర ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు ఆసనాలు సాధన చేశారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైల్వేన్యూకాలనీ సుబ్బలక్ష్మినగర్‌లో వేంచేసిన చింతామణి గణపతి ఆలయం సన్నిధిలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీవీఎస్ఎల్ రాజు పాల్గొన్నారు.

సమాజ సమానత్వానికి అన్ని మతాలు కలిసి పనిచేయాలి

» ఆచార్య బాల మోహన్‌దాస్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్ దాస్

సీతమ్మధార, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సమానత్వం కోసం అన్ని మతాలు కలిసి పనిచేయాలని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పిలుపునిచ్చారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల్లోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో బి.వి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మనీ, గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో పవిత్ర ప్రవక్త హజరత్ మహ్మద్ 1500వ జన్మ వార్షికోత్సవం, మిలాద్ ఉన్ నబీని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో 11 శాతం ముస్లింలు ఉన్నారని, వారి అయిదు స్తంభాలు సమాజ నిర్మాణానికి బలమని, అశోక ధర్మ చక్రంలోని 24 అరాలు కూడా ముస్లింలు ఆచరించే విలువలను సూచిస్తాయని వివరించారు. గాంధీ సెంటర్‌లో గల గాంధీ విగ్రహం వద్ద అతిథులంతా కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె అబ్దుల్ రజాక్, డాక్టర్ కేవీఎస్ మూర్తి, ప్రొఫెసర్ ఎస్ఎం ఇక్బాల్, సిస్టర్ బి.కె.రమేశ్వరి, ఎంవీ ఖాన్, శివాజి, సురేష్ జోగారావు, హుస్సేన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

» ఎంఎంటీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సమావేశంలో జనరల్ సెక్రటరీ కె.ఎ.నరసింహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎంటీసీ జనరల్ సెక్రటరీ కె.ఎ.నరసింహన్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎంఎంటీసీ (మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిరంతరం కృషి చేస్తుందని ఆలిండియా రిటైర్డ్ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ కె.ఎ.నరసింహన్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఎంఎంటీసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నరసింహన్, అధ్యక్షుడు ఎస్‌కే వశిష్టులు జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ వంటి ప్రయోజనాలు సమయానికి అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఆరోగ్య బీమా పథకాలు, వైద్య ఖర్చులు సైతం శాతశాతం వచ్చేలా తమ సంఘం కృషిచేసిందన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సైలాడ మురళీకృష్ణమోహన్ మాట్లాడుతూ వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. సంఘం అధ్యక్షుడు ఎ.కైలాసరావు, కోశాధికారి పి.రామకృష్ణారావు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుకకొండపై పౌర్ణమి పూజలు



సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

మహారాణిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భాద్రపద పౌర్ణమి సందర్భంగా ఇసుకకొండపై గల రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రగ్రహణం నేపథ్యంలో భక్తులు తెల్లవారుజాము నుంచే విచ్చేసి సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు, ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ, పద్మజా దంపతులు విచ్చేయడంతో అర్చకులు వారితో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు.

అశోక్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం

» ఆయనను మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలి

» శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుషికొండ భవనాలను మానసిక చికిత్సాలయం (మెంటల్ హాస్పిటల్)గా మార్చాలని గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజు చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని శాసనమండలి విపక్షనేత బొత్ససత్యనారాయణ అన్నారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడడం ఆయన మానసికస్థితిని తెలియజేస్తున్నదన్నారు. రాచరికపు పోకడలు, అహంకారం, రాజకీయ దుర్బుద్ధితో మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజును ముందు మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలని బొత్స డిమాండ్ చేశారు. రుషికొండ భవనాలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పరిశీలించినపుడు సీలింగ్ ఊడిపోయిందని మీడియాకు చూపించారని, అది ఊడిపోయిందో... ఊడగొట్టారో నిర్ధారించుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. ఒకవేళ ఊడిపోతే నాసిరకమైన సామాగ్రిని వాడినట్టే కాబట్టి, కూటమి ప్రభుత్వహయాంలోనే సంబంధిత కాంట్రాక్టర్‌కు చెల్లింపులు జరిపినందున అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. రుషికొండ భవనాలను ఏం చేయాలో తెలియడం లేదని చెబుతున్నారని, సీఎం పర్యటనకు నోవాటెల్, రాడిసన్‌బ్లూ హోటల్‌కు గత ఏడాదికాలంలో ఇచ్చినబిల్లులు చూస్తే ఆయా కార్యక్రమాలకు దీనినే ఎందుకు వాడుకోకూడదనేది తెలుస్తుందన్నారు. అలాచేసినా, లేదంటే ఎవరికైనా వేలం ద్వారా లీజుకు ఇచ్చినా ఏడాదికి రూ.25 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందన్నారు. ఇది ప్రభుత్వానికి తన ఉచిత సలహా మాత్రమేనన్నారు. రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రశ్నిస్తే ప్రభుత్వంలోని పెద్దలు బెదిరిస్తున్నారని బొత్స ఆరోపించారు. బెదిరింపులకు ఎవరూ భయపడిపోరని, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకి అప్పగించాలని చంద్రబాబు నిర్ణయించారని, వీటిని వారి అనుయాయులకు వాటిని కట్టబెట్టేందుకేనని బొత్స అనుమానం వ్యక్తంచేశారు. గత 14 నెలల్లో రూ.2 లక్షల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వం.. వైద్య కళాశాలలకు రూ.6 వేల కోట్లు కేటాయించలేదా? అని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై ఈ నెల తొమ్మిదిన రాష్ట్రవ్యాప్తంగా నిరసనకార్యక్రమాన్ని నిర్వహిస్తామని బొత్స పేర్కొన్నారు.

ముగిసిన ర్యాంకింగ్ చెస్ చాంపియన్‌షిప్



విజేతలతో ఏయూ మాజీ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య చెస్ అకాడమీ నిర్వహించిన 8వ ర్యాంకింగ్ చెస్ టోర్నీ ఆదివారం ముగిసింది. నగరంలోని శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆవరణలో జరిగిన ఈ టోర్నీలో వివిధ జిల్లాల నుంచి 230 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ జి.శ్రీనివాసరావు, ఆంధ్ర చెస్ సంఘం ఉపాధ్యక్షుడు ఎంవీరావు, ఆల్ విశాఖ చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి మణికంఠ, ఆదిత్య చెస్ అకాడమీ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

బాలికల అండర్-6లో రేణుశ్రీ, అండర్-8లో మనస్వి, అండర్-10లో గిరీష్ మా అనంతలక్ష్మి, అండర్-12లో శ్రీలక్ష్మి మన్విత, అండర్-14లో అంజన కోనూరు, అండర్-16లో లక్ష్మీప్రియ బట్టు ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర అండర్-6లో అభినవ్ వైద్యభూషణ, అండర్-8లో శవాంక్ కుంచ, అండర్-10లో సార్థ్వేష్, అండర్-12లో జశ్విన్ వడ్డీ, అండర్-14లో వాకాడ శ్రీరామ్ జైన్, అండర్-16లో వెంకటేశ్వరరావులు ప్రథమ స్థానంలో నిలిచారు.

టీడీపీ వార్డు అధ్యక్షుల నియామకం



బండి రంజిత్ (55వ వార్డు)

కంచరపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా బండి రంజిత్, ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డిలను నియమిస్తున్నట్టు పార్లమెంట్ సభ్యుడు శ్రీభరత్ ప్రకటించారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలో గల అన్ని వార్డులకు నూతన అధ్యక్ష, కార్యదర్శులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జిల సమక్షంలో ఎంపీ భరత్ శనివారం ప్రకటించారు. 47వ వార్డు అధ్యక్షుడిగా చెంగల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సత్యనారాయణ రాజును నియమించారు. నూతనంగా ఎన్నికైన వారిని నాయకులు,కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీని బలోపేతం చేస్తామని నూతన అధ్యక్షులు పేర్కొన్నారు.

50వవార్డుకు వరప్రసాద్



మురళీనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 50వ వార్డు టీడీపీ అధ్యక్షునిగా ఎస్.వరప్రసాద్‌ను నియమించారు. ఆయనకు ఎంపీ, గండి బాబ్జి కలిసి నియామక పత్రం అందించారు. వార్డు కార్యాలయంలో అభిమానులు వరప్రసాద్‌ను అభినందించారు. తనకు మరోసారి అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్ఠానానికి వరప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా స్విమ్మింగ్ సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి, పర్యవేక్షకులు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. బీచ్‌రోడ్డు ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరిగిన ఎన్నికలలో అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్ శెట్టి, కార్యదర్శిగా జి.శ్రీరామమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.మోహన వెంకటరామ్, కోశాధికారిగా ఎన్.రఘునాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.రామారావు, డి.లక్ష్మీసింధు, విజయ్‌కుమార్ నటరాజన్, కె.రవికుమార్, పరవాడ ఈశ్వరరావులు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఎస్.శ్రీధర్, బీవీఎస్ఎన్.ఎ.రాజి, జాన్ జీవన్‌కుమార్ రంధి (రైల్వేస్), ఈగల హేమంత్‌కుమార్ (రైల్వేస్), పి.రమేష్‌లు ఎన్నికయ్యారు. మరో ఏడుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారని నూతన కార్యదర్శి జి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర స్విమ్మింగ్ సంఘం కోశాధికారి ఐ.రమేష్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నుంచి పి.శైలజ, ఒలింపిక్ సంఘం నుంచి ఐ.వెంకటేశ్వరరావు పర్యవేక్షకులుగా, ప్రముఖ న్యాయవాది పల్లా బాలాజీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

ఉచిత దంతవైద్య శిబిరానికి స్పందన



దంత చికిత్స చేస్తున్న డాక్టర్ అనుషా పట్నాయక్, చిత్రంలో కార్పొరేటర్ కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు ఉచితంగా దంతవైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని జీవీఎంసీ 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. అల్లిపురంలోని శిష్టకరణాల సంఘం కార్యాలయంలో ఫోర్ డిస్ డెంటల్ హాస్పటల్ సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. దంత సంరక్షణపై అవగాహన కల్పించి, ఉచితంగా పేస్టులు, నోటి శుభ్రత (మౌత్ వాష్) మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎన్.కె మహంతి, ఆసుపత్రి అధినేత డాక్టర్ సుధాకర్ పట్నాయక్, డాక్టర్ అజిత్, అనుషా పట్నాయక్, కార్యదర్శి డి.హరనాథ్, మంత్రి శాలివాహన్, పక్కి బాలాజీ విఠల్, పక్కి నరసింహారావు, కుప్పిలి ఆనందరావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ట్రాఫిక్ పోలీసులపై దాడి...!

కంచరపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి మెట్టు వద్ద ఆదివారం రాత్రి డ్రంక్&డ్రైవ్ కేసులు రాస్తుండగా మద్యం మత్తులో ఉన్న వ్యక్తి ట్రాఫిక్ పోలీసులపై దాడికి పాల్పడినట్టు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం మెట్టు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్‌పై కోడి మహేష్ అనే వ్యక్తి దాడికి పాల్పడడంతో ఎస్ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనం నడిపి దొరికిపోవడంతో పోలీసులు బ్రీతింగ్ ఎనలైజర్ వీల్చమని చెప్పారు. ఇందుకు ఆగ్రహించిన మహేష్ కేసు రాసుకోండి అంటూ దాడికి దిగాడు.

పేకాడుతున్న 9మంది అరెస్టు

కంచరపాలెం స్టేషన్ పరిధి పట్టాభిరెడ్డితోట భాస్కర్ గార్డెన్స్‌లోని ఓ ఇంటిలో పేకాడుతున్నట్టు సమాచారం రావడంతో ఆదివారం పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.37 వేల నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు కంచరపాలెం సీఐ కె.రవికుమార్ తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్టు సీఐ పేర్కొన్నారు.

అగ్నిమాపక శాఖ అధికారులతో డీజీ సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీజీ వెంకటరమణ

విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో అగ్ని మాపక శాఖ పనితీరుపై ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ పి.వెంకటరమణ ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఐఐఎం క్యాంపస్‌లో జరిగిన ఈ సమావేశంలో తొలుత ఆయన ఆయా జిల్లాల్లోని శాఖల పనితీరు, భవనాల పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఓసీల జారీని రాష్ట్ర ప్రభుత్వం వికేంద్రీకరించడంతో ప్రజలు సులభంగా ఎన్ఓసీలు పొందగలుగుతున్నారని చెప్పారు. రాష్ట్ర మున్సిపల్ శాఖతో కలిసి సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులు ఇవ్వడం వల్ల ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందన్నారు. వాట్సాప్ ద్వారా సేవలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. స్టేషన్లలో పరిశుభ్రత పెంపొందించేందుకు ఈనెలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ప్రతి బుధవారం సిబ్బంది సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరిస్తామని, దీనిపై సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. కాగా హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్‌బీసీ ప్రకారం అగ్నిమాపక భద్రతా చర్యలు లేని భవనాలకు నోటీసులు జారీ చేస్తున్నామని కొందరు అధికారులు డీజీకి వివరించారు. ఈ సమావేశంలో జోన్-1 ప్రాంతీయ అగ్నిమాపక అధికారి డి. నిరంజన్ రెడ్డి, ఆరు జిల్లాల శాఖాధికారులు, పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా

... 5వ పేజీ తరువాయి

ఉందంటున్నారు. కళాశాల చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల చుట్టూ కంచె ఏర్పాటుచేసి హెచ్చరిక బోర్డులు పెట్టాల్సి ఉంది.

నిర్మాణాలు ఆపించాం

విశాఖ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని సర్వే నంబరు 58లో ప్రభుత్వ భూమి ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించాం. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. వారు ఆదేశాలు జారీచేసిన వెంటనే తొలగింపు చర్యలు చేపడతాం. **- జి.విజయం, వీఆర్వో, నరవ**

ప్రాణం తీసిన వేట సరదా

... 5వ పేజీ తరువాయి

బాల్యమిత్రులు. చిన్నపాటి పనులు చేస్తూనే చదువుకుంటున్నారు. వచ్చిన డబ్బుతో కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నారు. ఎక్కడికైనా కలిసే వెళ్తారు. చివరకు మృత్యువులోనూ వారి బంధం వీడలేదు. బల్లంకి శేఖర్. యాదాడ లక్ష్మణ్‌కుమార్ మృతితో పెందుర్తిలో విషాదం అలముకుంది, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. శేఖర్ చిన్నప్పుడే తండ్రి బంగార్రాజు మరణించడంతో తల్లి మహాలక్ష్మి కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. అన్నయ్య వాసు, మిత్రుడు లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి శేఖర్ డాక్‌యార్డులో పనికి వెళ్లేవాడు. లక్ష్మణ్‌కుమార్ తండ్రి సూరిబాబు ఎలక్ట్రీషియన్, తల్లి లక్ష్మి టైలర్. అన్నయ్య మన్మథరావు బిగ్‌బాస్కెట్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన అన్నయ్య వాసు, మిత్రుడు లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి చేపలు పట్టేందుకు మేహాద్రి రిజర్వాయర్‌కు వెళ్లారు. ఈ క్రమంలో కాలుజారి లక్ష్మణ్‌కుమార్ నీటిలో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు దూకిన శేఖర్ విఫలమై, అతడు కూడా మునిగిపోయాడు. దీంతో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

నాన్‌స్టాప్ కౌంటర్లు ఖాళీ

... 5వ పేజీ తరువాయి

సర్వీసులున్నాయి. వీటితో పాటు ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసులు నడుస్తున్నాయి. వీటిలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంది. ఒకే కుటుంబానికి చెందిన పురుషులు ఒక బస్సులో, మహిళలు మరో బస్సులో ప్రయాణించేందుకు ఇష్టపడకపోవడంతో అందరూ ఈ ఐదు రకాల బస్సులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద జనం కనిపించడం లేదు. సాధారణంగా శ్రీకాకుళానికి ప్రతి 30 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ సర్వీస్ నడుస్తుంది. నర్సీపట్నానికి 50 నిమిషాల వ్యవధిలో, కాకినాడ, రాజమండ్రి గంట వ్యవధితో షెడ్యూల్ సర్వీసులు ఉన్నాయి. అయితే బస్సులు బయలుదేరే సమయానికి వీటిలో 30 శాతానికి మించి ఆక్యుపెన్సీ రావడంలేదు. దీంతో కొన్నింటిని రద్దు చేసి బస్సుల మధ్య వ్యవధి పెంచారు. శ్రీకాకుళం నాన్‌స్టాప్‌లను 30 నిమిషాల నుంచి 45 నిమషాలకు, నర్సీపట్నానికి 50 నిమిషాల నుంచి 1.10గంటలకు, రాజమండ్రి, కాకినాడలకు గంట నుంచి గంటన్నర వ్యవధితో బస్సులు నడుపుతున్నారు. అయినా ఆక్యుపెన్సీ రేషియో 40 శాతానికి మించి రావడంలేదని అధికారులు వాపోతున్నారు. స్త్రీశక్తి పథకం అమలు ప్రభావం నాన్‌స్టాప్ సర్వీసులపై పడిందని చెబుతున్నారు.

ఉలిక్కిపడిన నగరం

... 5వ పేజీ తరువాయి

ట్యాంకులోపల, చుట్టూ మంటలు అంటుకున్నాయి. ట్యాంకు చుట్టూ మంటలను సుమారు ఎనిమిది గంటలు శ్రమించి ఆర్పేశారు. ట్యాంకు లోపల మంటలు అదుపుచేయడం అంత సులువుకాదు. మిథనాల్‌ను ట్యాంకు అడుగు భాగం నుంచి పైపు ద్వారా మరో ట్యాంకుకు తోడుతున్నారు. అదే సమయంలో ట్యాంకుపైన అంటుకున్న మంటలను అదుపు చేస్తున్నారు. సోమవారం ఉదయానికి మంటలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. కాగా మిథనాల్‌కు మండే స్వభావం ఉన్నా మంటల వల్ల కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, ఆక్సిజన్(నీటి ఆవిరి)గా మారుతున్నందున కొంత వరకు ప్రమాదం తగ్గుతుందని నిపుణులు వ్యాఖ్యానించారు. ఈస్టిండియా కంపెనీలో ప్రమాదం సంభవించిన వెంటనే ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు, పోలీసులు, కాలుష్య నియంత్రణమండలి అధికారులు సందర్శించారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఇన్‌చార్జి ఫైర్‌డీజీ వెంకటరమణ సందర్శించి పరిస్థితి సమీక్షించారు. స్టోరేజీకి ఎప్పటికప్పుడు అనుమతులు ఇస్తుంటామని కాలుష్య నియంత్రణమండలి ఈఈ ముకుందరావు తెలిపారు.

నగరంలో పిడుగులు సాధారణమే..

జనావాసాలకు దూరంగా పిడుగులు పడుతుంటాయి. అయితే ఒక్కోసారి తీవ్రమైన పిడుగులు నగరంలో ఖాళీ ప్రదేశాలు, ఎత్తైన చెట్లు/ టవర్లపై పడుతుంటాయి. పారిశ్రామిక కార్యకలాపాలు జరిగే ప్రాంతంలో ఆదివారం పిడుగు పడడం సాధారణమేనని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు. మిచాంగ్ తుపాన్ సమయంలో చినవాల్తేరులోని తుపాన్ హెచ్చరిక కేంద్రం సమీపంలో ఎత్తైన తాటిచెట్లపై పిడుగు పడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఏయూ ఉన్నత పాఠశాల సమీపంలో పిడుగు పడడంతో రెండు చెట్లు కాలిపోవడం చాలామంది చూసే ఉంటారన్నారు. పిడుగుల తీవ్రత ఏటా పెరుగుతుందని, ప్రజలు నిరంతరం విద్యుత్ వాడుతుంటారని, పిడుగులు పడే వాతావరణం ఉన్నప్పుడు టీవీలు, సెల్‌ఫోన్లు ఆఫ్ చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, వాటిని వాడితే పిడుగు తీవ్రత పెరుగుతుందన్నారు.

జీవీఎంసీలో అవినీతి రాకెట్!

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదులు గుప్పించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియోజకవర్గం పరిధిలో ప్రజారోగ్య విభాగంలో కొందరు పనిచేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని, దీనిపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదుచేశారు. దీనిపై జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు వివరణ ఇస్తూ అలాంటిదేమీ లేదని, అందరూ కచ్చితంగా పనిచేస్తేనే జీతాలు అందుతాయని చెప్పడంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గంట సమయం ఇస్తానని, ఎమ్మెల్యే చెప్పిన పదిమంది కార్మికులు ఎక్కడెక్కడ విధులు నిర్వర్తించారనే దానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉంటే తీసుకురావాలని ఆదేశించారు. కానీ జోనల్ కమిషనర్ వాటిని తీసుకురాలేకపోవడంతో జీవీఎంసీ పనితీరుపై తీవ్రస్థాయిలో ఇన్‌చార్జి మంత్రి ఆరోపణలు గుప్పించారు.

జీవీఎంసీలో కొంతమంది సర్వేయర్లు ప్రైవేటు వ్యక్తులకు అనుకూల నివేదికలిస్తున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యేలు పలుమార్లు ప్రస్తావించారని, చీఫ్ సిటీ ప్లానర్ సమావేశానికి రాకపోవడంతో చాలామంది ఎమ్మెల్యేలు తమ ఫిర్యాదులను బయటపెట్టలేకపోయారన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి జరుగుతున్న సమాచారం తన వద్ద ఉందన్నారు. పెద్దఎత్తున నిధులను కొల్లగొట్టే రాకెట్ నడుస్తోందని, త్వరలోనే దీనిని బయటకు తీస్తానని హెచ్చరించినట్టు కొందరు ఎమ్మెల్యేలు చెప్పడం చర్చనీయాంశంగా మారింది. జీవీఎంసీలో కొంతకాలంగా రాత్రిఫుడ్‌కోర్ట్‌పై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. కౌన్సిల్ మీటింగ్ జరిగిన ప్రతి సారీ ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని సభ్యుడు డిమాండ్ చేయడం, తక్షణం తొలగించాలని మేయర్ ఆదేశాలు ఇలివ్వడం పరిపాటిగా మారింది. దీనివెనుక కొందరు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కోడివ్యర్థాలను చేపల చెరువులకు తరలింపు అంశంపై కార్పొరేటర్లు, ఎమ్మెల్యేల మధ్య పెద్దయుద్ధమే జరుగుతోంది. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో సర్వేయర్లు ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా నివేదికలను ఇచ్చి పార్కులు, గెడ్డలను అన్యాక్రాంతం చేస్తున్నారని చెబుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో కొందరు అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వారికి అనుకూలంగా అంచనాలు తయారుచేయడం, టెండర్లను అస్మదీయులకు వచ్చేలా సహకరించి, భారీగా జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. యూసీడీ విభాగంలో మహిళా సంఘాల ఆడిట్ పేరుతో సిబ్బంది పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులున్నాయి. వీటన్నింటిపైనా ఇన్‌చార్జి మంత్రికి పూర్తి సమాచారం అందడంతోనే జీవీఎంసీలో అవినీతి రాకెట్ నడుస్తోందని వ్యాఖ్యానించి ఉంటారనే అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యాఖలు జీవీఎంసీలోని కొందరు అధికారుల్లో గుబులురేపుతున్నాయి. ఏక్షణంలో సమీక్ష పేరుతో జీవీఎంసీకి వచ్చి తమ అవినీతి, అక్రమాలను నేరుగా బయటపెడతారోనని ఆందోళన చెందుతున్నారు.

ఊపిరాడడం లేదు..



పారిశ్రామికవాడలోని స్థలంలో నిల్వ ఉంచిన కోల్ వ్యర్థాల గుట్టలు

- దుమ్ము ధూళితో నిండిపోతున్న పలు ప్రాంతాలు
- అనారోగ్యాల బారిన పడుతున్నామని జనం గగ్గోలు
- ఫిర్యాదులు చేసినా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన

పెదగంట్యాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి):

పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని పలు యూనిట్లు పరిసర కాలనీలకు ప్రమాదకరంగా పరిణమించాయి. వీటినుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి పరిసర ప్రాంతాల ప్రజలకు ఊపిరాడకుండా చేస్తున్నాయి. ఆయా యూనిట్ల నిర్వాహకులు కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్లే తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పరిసర ప్రాంతాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పెద్దఎత్తున దుమ్ము, ధూళి వస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా వారి చర్యలు కంటితుడుపుగానే ఉంటున్నాయని వాపోతున్నారు. కాలుష నియంత్రణకు ఆయా యూనిట్ల యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలంటూ నాలుగుసార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయిందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే తామిక్కడ ఉండలేమని చెబుతున్నారు.

వివిధ ప్రాంతాల్లోని స్టీల్‌ప్లాంట్ల నుంచి స్లాగ్‌ను, థర్మల్ పవర్ స్టేషన్ల నుంచి కోల్ వ్యర్థాలను టిప్పర్ల ద్వారా ఇక్కడి యూనిట్లకు తీసుకువచ్చి అన్‌లోడ్ చేస్తున్నారు. అలా తెచ్చిన వ్యర్థాలు ఇక్కడ గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. టిప్పర్లతో తెచ్చేటప్పుడు వాటిపై టార్పాలిన్లు వంటివేవీ కప్పడం లేదు. టిప్పర్లు వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో గాలికి దుమ్ము, ధూళి రేగుతోంది. అలాగే యార్డుల్లో అన్‌లోడ్ చేసేటప్పుడు పెద్దఎత్తున ధూళి ఎగిరి గాలిలో కలుస్తూ ఆయా ప్రాంతాలకు వ్యాపిస్తోంది. కాగా ఈ మెటీరియల్‌ను భారీ యంత్రాలతో రీసైక్లింగ్ చేస్తున్నంతసేపు దుమ్ము, ధూళి ఎగిరి గాలిలో కలుస్తూ తమ ప్రాంతాలకు వ్యాపిస్తుండడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దీంతో పాత పెదగంట్యాడ, సత్యనారాయణపురం, కండిపిల్లి వీధి, కొత్త దిబ్బపాలెం, అశోక్‌నగర్, తదితర ప్రాంతాలు కాలుష్యం బారిన పడుతున్నాయి. ఇళ్లు, డాబాలపై, వీధుల్లో పెద్దఎత్తున దుమ్ము, ధూళి పేరుకుపోతున్నాయని, ఇళ్లను ఎన్నిమార్లు శుభ్రం చేసినా కాసేపటి తరువాత మళ్లీ ధూళితో నిండిపోతుందని స్థానికులు చెబుతున్నారు. ఆరుబయట, డాబాలపై ఉతికిన దుస్తులను ఆరబెడితే దుమ్ము, ధూళితో రంగు మారిపోతున్నాయని పేర్కొంటున్నారు. ఈ కాలుష్యం కారణంగా ఊపిరి తిత్తుల వ్యాధులు, గొంతు, కళ్ల మంటతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టకపోతే తీవ్ర స్థాయిలో ఆందోళనకు దిగుతామని వారు స్పష్టం చేస్తున్నారు.



స్లాగ్ రీ సైక్లింగ్ చేస్తున్న యూనిట్లు

అనధికారికంగా యూనిట్ల నిర్వాహణ



-జి.పెద్దరెడ్డి, పెదగంట్యాడ గ్రామ పెద్ద

పారిశ్రామికవాడలో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ వారు స్థలాలు కేటాయించారు. వారు ఇక్కడ పరిశ్రమలు పెట్టకుండా ఇలాంటి కాలుష్యకారక యార్డులను పెట్టి పరిసర గ్రామాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. యూనిట్ల నుంచి దుమ్ము, ధూళి వెలువడకుండా మెటీరియల్‌పై టార్పాలిన్లు కప్పాలని, ఎప్పటికప్పుడు స్ప్రింక్యులర్ సిస్టమ్ ద్వారా వాటర్ చల్లాలని చెప్పినా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

ఇప్పటికైనా అధికారులు స్పందించాలి



-పి.సత్యనారాయణ, సత్యనారాయణపురం

పారిశ్రామికవాడలోని స్లాగ్, కోల్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్ల నుంచి మితిమీరిన కాలుష్యం వెలువడుతుంది. యూనిట్ల నుంచి ఎగిరి గాలిలో కలిసిన దుమ్ము, ధూళి కాలనీలోకి చేరుతుంది. దీంతో ఇళ్లు కూడా రంగుమారిపోతుండడమే కాకుండా స్థానికులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. పలుమార్లు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా వారు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

తలుపులు, కిటికీలు మూసుకుని ఉండాల్సిందే..



-కె.వెంకటలక్ష్మి, కండిపిల్లి వీధి

రీసైక్లింగ్ యూనిట్లకు పక్కనే ఉన్న కండిపిల్లి వీధిలో నివసిస్తున్న మేమంతా రాత్రీపగలు ఇంటి తలుపులు, కిటికీలు మూసుకుని ఉంటున్నాం. అయినా దుమ్ము, ధూళి ఇళ్లలోకి వచ్చేస్తుంది. డాబాలపై పెద్దఎత్తున మట్టి పేరుకుపోతుంది. ఉతికిన వస్త్రాలు డాబాలపై ఆరబెడితే రంగు మారిపోతున్నాయి. చిన్నపిల్లలు తరచూ దగ్గు, గొంతునొప్పి బారిన పడుతున్నారు.



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న గండి బాబ్జీ

పేదలకు పెన్నిధి సీఎం సహాయ నిధి

పెందుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి వంటిదని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఆదివారం నియోజవర్గ పరిధికి చెందిన పదిమంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు భరణికాన రామారావు, సుఖవాసి అజయ్, ఆదిత్యానాయుడు, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే పల్లా న్యాయం చేస్తారని చూస్తున్నాం'

ఆటోనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆరు నెలల్లోగా పరిష్కరిస్తామన్నారని.. ఇందుకోసం తామంతా ఎదురుచూస్తున్నామని 88వ వార్డు పరిధి యాదవజగ్గరాజుపేటకు చెందిన గ్రామ పెద్దలు పేర్కొన్నారు. యాదవజగ్గరాజు పేటలో ఆదివారం ఏపీఐఐసీ నిర్వాసితుల బాధితుల సంఘం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నాయకుడు గొలగాని సన్యాసిరావు, పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆటోనగర్ పరిశ్రమల కోసం కారుచౌకగా నాడు భూములు ఇచ్చామని, అయితే తమ కోసం కేటాయించిన భూములను ఇప్పటికీ పంపిణీ చేయలేదన్నారు. గ్రామ పెద్దలందరూ అర్హులైన నిర్వాసితుల ప్రత్యేక జాబితాను రూపొందించి ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావు సూచించిన నేపథ్యంలో ఈ గ్రామ సభను నిర్వహించామన్నారు. నాలుగు దశాబ్దాల భూ సమస్యను ఆరు నెలల్లోగా పరిష్కరిస్తామన్న ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, అందువల్ల తమ సమస్య పరిష్కారానికి నోచుకుంటుందన్న నమ్మకం ఏర్పడిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఆ దిశగా పల్లా తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం.రమణ, మాడిశ కనకరాజు, నమ్మి ప్రసాద్, ఎం.రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉక్కు టౌన్‌షిప్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షణను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి శ్రీవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గిరి ప్రదక్షణను ప్రారంభించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గిరి ప్రదక్షణ ముగిశాక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని మధ్యాహ్నం 3 గంటలకు మూసివేశారు.

సమస్యలపై చర్చించిన కూటమి నాయకులు

అగనంపూడి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డుకు చెందిన కూటమి నాయకులు ఆదివారం స్థానికంగా సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. గతంలో వివిధ సమస్యలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో గ్రామాల అభివృద్ధికి రూ 5.7 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో త్వరితగతిన పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపనలు చేపట్టేలా చూస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీప్రసాద్, టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దేవేంద్ర, నాయకులు గవర సోమశేఖర్, దాసరి త్రినాథ్, కె.తాతారావు, బి.అప్పలరాజు, వెంకటేశ్వరరావు, కె.రమణ, బోయన్న, ఎం.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఆదివారం పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. జడ్‌ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డిలు మాట్లాడుతూ దువ్వాడ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో స్వచ్ఛ భారత్, అవగాహన ర్యాలీని రైల్వే ఉన్నతాధికారుల అనుమతితో నిర్వహించామన్నారు. స్టేషన్ టికెట్ కౌంటర్, వీఐపీ లాంజ్, వాహనాల పార్కింగ్, మెయిన్ సిగ్నల్ క్యాబిన్, టిక్కెట్ కౌంటర్ వెనుక గల రహదారిలో చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్క లను తొలగించి శుభ్రంగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాషువా, ఇతర ప్రతినిధులు, మానవ వనరుల సంఘం సభ్యులు, రైల్వే, ఆర్పీఎఫ్ సిబ్బంది, స్పందన చేయూత ఫౌండేషన్, మానవ వికాస వేదిక, మానవత, సత్యసాయి సేవా సమితి, సర్వహిత చారిటబుల్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్, యూత్ హాస్టల్స్ సభ్యులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీ

జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో కాలనీవాసులు నిషేధిత ప్లాస్టిక్ నివారణే ధ్యేయంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వాకర్స్ పార్కులో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలను, గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం మాట్లాడుతూ ప్లాస్టిక్ వద్దు-క్లాత్ సంచులే ముద్దు, కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, కామరాజు, శ్రీరాములు, సోమరాజు, జీవానందం, రామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు మార్కింగ్ పనులు

వేపగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేపగుంట నుంచి పినగాడి వెళ్లే మార్గంలో రోడ్డు మార్కింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా వేపగుంట కూడలి నుంచి ప్రస్తుతం 60 అడుగుల రహదారిని నిర్మించేందుకు గాను రోడ్డుకు ఇరుపక్కలా మార్కింగ్ చేపట్టారు. అలాగే ఖాళీ స్థలాల గుర్తింపు, ఎంతవరకు రహదారి వస్తుందో పలు భవనాలు, ఇతర సముదాయాలపై మార్కింగ్ చేశారు. రహదారికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాల యాజమానులు తమ భూమి పత్రాలను తీసుకువచ్చి జీవీఎంసీ వేపగుంట కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ అధికారులకు అందజేయాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, టీపీవో బొప్పన్న, సర్వేయర్ కుమార్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య గణపతి సన్నిధిలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పెదగంట్యాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి సాయిరామ్‌నగర్‌లోని వైద్య గణపతి సన్నిధిలో సింహగిరి సంగీత అకాడమీ సభ్యులు ఆదివారం మధ్యాహ్నం నృత్య ప్రదర్శన చేశారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ జమునారాణి పర్యవేక్షణలో అన్నమయ్య కీర్తనలు, విష్ణుసహస్రనామ కీర్తనలకు సభ్యులు నృత్యాలు చేశారు. వీరిలో డాక్టర్ కేవీఎస్ కల్యాణ్, డాక్టర్ అశ్విని, మౌనిక, తదితరులు ఉన్నారు.



ఆలయానికి తాళం వేస్తున్న అర్చకులు

చంద్రగ్రహణంతో వెంకటాద్రి ఆలయం మూసివేత

పెందుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఉదయం 11.30 గంటలకు ఇక్కడి వెంకటాద్రిపై గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేశారు. ప్రధాన అర్చకుడు మహర్తి రామానాజుచార్యుల పర్యవేక్షణలో అర్చకులు వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల దర్శనాల అనంతరం గర్భాలయ ప్రవేశ ద్వారానికి తాళం వేసి ఆలయాన్ని మూసివేశారు.

గ్రహణ దోష నివారణ కోసం ధ్వజస్తంభం, శ్రీవారి మూలవిరాట్ పాదాల వద్ద దర్భలను ఉంచారు. సోమవారం ఉదయం ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. ఆ తరువాత తోమాల సేవ, కొలువు, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. ఉదయం 8 గంటల నుంచి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని రామానాజుచార్యులు తెలిపారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 28, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 24, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 46, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 70, బరబాటి 42, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276

కూటమి హయాంలో రజకులు అన్ని రంగాల్లో అభివృద్ధి

- 'రజకుల ఆకాంక్ష సభ-2'లో మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, కొల్లు రవీంద్ర



వేదికపై మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు పంచకర్ల, ఎన్.ఈశ్వరరావు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు

విశాఖపట్నం (సిరిపురం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రజకులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి సాధించేందుకు పూర్తి అవకాశాలు కలిగిస్తున్నామని రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షతన 'రజకుల ఆకాంక్ష సభ-2 ప్రభుత్వ పథకాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మంత్రులు తొలుత సంత్‌గాడ్గే, మావిడాల మాచయ్య, వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రజకులకు ఐక్యత అవసరమన్నారు. ప్రభుత్వం వారి కోసం తీసుకొచ్చే జీవోలను అడిగి మరీ అమలు చేయించుకోవాలని సూచించారు. రజకుల జీవన పరిస్థితులు ఇంకా వెనుకబాటుగా ఉండటం బాధకరమన్నారు. కులవృత్తులను రిజర్వ్ చేయడంతో పాటు, హోటల్స్ టూరిస్ట్ రిసార్టులలో దోబీ పనిని హక్కుగా కల్పించేలా ప్రత్యేక చట్టం రావాల్సి ఉందన్నారు. రజకులను ఎస్సీల్లో చేర్చే తీర్మానాన్ని టీడీపీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రజక సామాజిక వర్గానికి ఒక ప్రత్యేకస్థానం ఉందన్నారు. నిజం చెప్పాలంటే నేను కూడా నన్ను రజక వర్గానికి చెందినవాడిగానే భావిస్తానన్నారు. తమ ఇంట్లో ఓ సోదరి నాకు ఇస్త్రీ చేయడం నేర్పించిందన్నారు. కొన్నేళ్లపాటు నేనే ఇస్త్రీ చేసుకున్నానన్నారు. బలహీనవర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలను ముందుకు తెచ్చిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దోబీల నియామకానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు రూపొందించిన చట్టాల ద్వారా హక్కులను సాధించుకోవాలని సూచించారు. గతంలో బలహీనవర్గాల నేతలపై దాడులు జరిగాయని అన్నారు.త్వరలోనే బీసీ రక్షణ చట్టం రానుందని హామీ ఇచ్చారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. నైపుణ్య శిక్షణలు అందించి స్వయం ఉపాధి దిశగా సహకారం అందిస్తామన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ చదువు వల్లే దారిద్ర్యానికి విముక్తి లభిస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కులవృత్తులను గౌరవిస్తూనే ఆధునికతో కలిపి ముందుకు తీసుకెళ్లాలన్నారు. రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ హక్కుల సాధనలో అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ హక్కుల సాధనకు రాజకీయమేమార్గమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రజకుల సంక్షేమం కోసం టీడీపీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రజకులకు ఎస్సీ హోదాపై చర్చ జరుగుతుందన్నారు. ఈ అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ల కమిటీ అధ్యయనం చేసినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, పెద్ద సంఖ్యలో రజకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎన్‌టీఏ ముందంజ

- ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు



సమావేశంలో మాట్లాడుతున్న వేపాడ చిరంజీవిరావు

పెందుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) ముందంజలో ఉందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. ఎన్‌టీఏ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి సమావేశాన్ని ఆదివారం పెందుర్తిలో గల టీటీడీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను చేపట్టిన ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను చేపడుతుందన్నారు. విద్య ప్రాధాన్యం, విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులను మంత్రి నారా లోకేశ్ కేటాయించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, రాష్ట్రంలో 85 శాతం మంది ఉపాధ్యాయులు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు హయాంలోనే డీఎస్సీల ద్వారా కొలువులు సాధించారన్నారు. ఎన్టీఏ జిల్లా అధ్యక్షుడు టీవీ రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బొనిగెల హైమారావు, నాయకులు జె.శ్రీనివాసరావు, శ్రీదేవి, పెనుమత్స కృష్ణంరాజు, నక్కా శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చూపిన ఎమ్మెల్యే పంచకర్ల



వృద్ధురాలికి సహాయం చేస్తున్న ఎమ్మెల్యే అనుచరులు. చిత్రంలో పంచకర్ల రమేశ్‌బాబు ఉన్నారు

పెందుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మానవత్వం చూపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధురాలికి అండగా నిలిచి ఆమెకు వైద్య సహాయం అందేలా చేశారు. నగరంలోకి ఆయన కారులో వస్తుండగా ఎస్‌ఆర్‌పురం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై ఓ వృద్ధురాలు గాయాలతో కనిపించింది. దీంతో పంచకర్ల కారు దిగగా ఆయన సిబ్బంది ఆమెకు సపర్యలు చేశారు. వెంటనే ఎమ్మెల్యే సింహాచలం ఆస్పత్రికి ఫోన్ చేసి అంబులెన్స్‌లో తరలించి వైద్య సహాయం అందించేలా చర్యలు చేపట్టారు.

శంకర్ ఫౌండేషన్‌కు బీవోఐ విరాళం

వేపగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట శంకర్ ఫౌండేషన్‌కు బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.పది లక్షల విలువ చేసే ఫండస్ కెమెరాను విరాళంగా అందజేసింది. ఈ కెమెరాతో రోగులకు మరింత కచ్చితత్వంతో కంటి పరీక్షలు చేసేందుకు వీలు కలుగుతుంది. ఈ కెమెరాను బీవోఐ జోనల్ మెనేజర్ నికేశ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ మేనేజర్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జీఎం రాధాకృష్ణ పి.రమేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ ఏర్పాటు

పెదగంట్యాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అభివృద్ధి కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా పులి లక్ష్మీబాయి, కన్వీనర్‌గా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంపత్‌బాబు, సభ్యులుగా డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, గాజువాక జోనల్ కమిషన్ బీఆర్ఎస్ శేషాద్రి, తహశీల్దార్ అమల, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌పైడి హేమలత నియమితులయ్యారు. అనంతరం పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ పీహెచ్‌సీని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.



సలీమాను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సలీమా

మల్కాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 60వ వార్డు పరిధి ఇందిరా కాలనీ-2కు చెందిన సలీమాను రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆమెను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు ఆదివారం సన్మానించారు. తనకు ఈ అవకాశం కల్పించిన గణబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాతా శ్రీనివాసరావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చైర్మన్‌కు అభినందనలు

కూర్మన్నపాలెం ,సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పలు సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ అమిరెడ్డి మురళీధరరెడ్డికి ఆదివారం ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మురళీధరరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, కాలుష్య నివారణకు మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎన్.కుమారస్వామి, జి.ఆనంద్, నరసింగరావు, వెంకటేశ్వర్లు, మల్లేశం, ప్రభాకర్, చంద్రకిరణ్, తదితరులు పాల్గొన్నారు.



మురళీధరరెడ్డికి మొక్క అందజేస్తున్న దృశ్యం